PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 01 సంచిక - 285 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 07 రూ - 03/- గురువారం 10 అక్టోబర్ 2024

## వరద బాధితులకు ఎల్ అండ్ టి భారీ విరాళం




## కొడంగల్ మాజీ ఎమ్మెల్యే అరెస్టు




# రెండుసార్లు కోరి కొరివి దయ్యాన్ని తెచ్చుకున్నాం: సిఎం రేవంత్



**హైదరాబాద్,అక్టోబర్ 9(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రత్యేక తెలంగాణ కోసం నిరుద్యోగులు ఆత్మ బలిదానాలు చేసుకున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం నిరుద్యోగ సమస్య తీర్చలేదని అన్నారు. ఎల్బీ స్టేడియంలో 10 వేల టీచర్లకు నియామకపత్రాలు అందజేసే కార్యక్రమంలో సిఎం రేవంత్ మాట్లాడారు. "రెండుసార్లు కోరి కొరివి దయ్యాన్ని తెచ్చుకున్నాం. ప్రత్యేక తెలంగాణలో ఉద్యోగాలు భర్తీ అవుతాయని అందరూ ఆశించారు. తెలంగాణ వచ్చిన మూడేళ్లకు డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. గతంలో రెండేళ్లకు నియామక ప్రక్రియ పూర్తయింది. నిరుద్యోగుల సమస్యలు బిఆర్ఎస్ ఏనాడు పట్టించుకోలేదు. అందుకే.. కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని నిరుద్యోగులు బాధ్యత తీసుకున్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఇప్పుడు ఉద్యోగాలు వస్తున్నాయి. తండ్రీకొడుల ఉద్యోగాలు ఊడగొడితే.. మీకు ఉద్యోగాలు వస్తున్నాయి. అధికారంలోకి వచ్చిన 9 నెలలోనే 30 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. డీఎస్సీ విజేతలను చూస్తుంటే దసరా ముందే వచ్చినట్లు ఉంది" అని రేవంత్ రెడ్డి చెప్పారు.

# హర్యానా ఫలితాలను విశ్లేషిస్తున్నాం



- జమ్మూకశ్మీర్ ప్రజలకు కృతజ్ఞతలు
- ఎక్స్‌లో పోస్ట్ చేసిన కాంగ్రెస్ నేత రాహుల్

**న్యూఢిల్లీ,అక్టోబర్ 9(పిసిడబ్ల్యూ న్యూస్):**ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ హరియాణా లో కాంగ్రెస్ ఓటమి పాలైంది. ఈ క్రమంలో ఫలితాలపై ఆ పార్టీ అనుమానాలు వ్యక్తంచేసిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాల వేళ హరియాణాలో పరాజయంపై కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ తాజాగా స్పందించారు. ఈ అనూహ్య ఫలితాలను తాము విశ్లేషిస్తున్నామని తెలిపారు. ఈమేరకు 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. జమ్మూకశ్మీర్ ప్రజలకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ గెలుపు మన రాజ్యాంగం సాధించిన విజయం. ప్రజాస్వామ్య ఆత్మగౌరవానికి దక్కిన విజయం. ఇక హరియాణాలో అనూహ్య ఫలితాలపై మేం విశ్లేషణ చేపట్టాం. చాలా అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తాం. హరియాణాలో పార్టీ కోసం నిరంతరం పనిచేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు. ప్రజల హక్కులు, సామాజిక, ఆర్థికన్యాయం, నిజం కోసం మా పోరాటం కొనసాగుతుంది. ప్రజల గళాన్ని మేం వినిపిస్తూనే ఉంటాం అని రాహుల్ గాంధీ రాసుకొచ్చారు. హరియాణాలో వరుసగా మూడోసారి భాజపా విజయం సాధించింది. బుధవారం వెలువడిన ఫలితాల్లో 90 సీట్లకు గానూ 48 చోట్ల జయకేతనం ఎగురవేసింది. ఉదయం కౌంటింగ్ ప్రారంభం కాగానే కాంగ్రెస్ ఆధిక్యంలో ఉన్నట్లు కనిపించింది. గంట తర్వాత క్రమంగా ఫలితాలు తారుమారవడం ప్రారంభించి చివరకు భాజపా విజయం సాధించింది. కాంగ్రెస్ 37 సీట్ల వద్దే ఆగిపోయింది. కొన్నిచోట్ల మెజారిటీలు అత్యల్పంగా నమోదవడంతో రెండు పార్టీల మధ్య ఓట్ల తేడా స్వల్పంగానే ఉంది. దీంతో ఈ ఫలితాలపై కాంగ్రెస్ నేతలు అనుమానాలు వ్యక్తంచేశారు. ఈసీ పనితీరుతో పాటు ఈవీఎంల పైనా ఆరోపణలు చేశారు. మరోవైపు జమ్మూకశ్మీర్ లో ఇండియా కూటమి ఘన విజయం సాధించింది. ఆర్టికల్ 370 రద్దు, కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజన తర్వాత జరిగిన ఈ ఎన్నికల్లో ఎన్‌సీ, కాంగ్రెస్ కూటమి అధికారాన్ని చేజిక్కించుకుంది. కూటమిలోని ఎన్‌సీ 42, కాంగ్రెస్ 6, సీపీఎం 1 సీటును గెలుచుకున్నాయి. భాజపా 29 సీట్లతో రెండో అతి పెద్ద పార్టీగా అవతరించింది.

# రెపో రేటుపై ఆర్బీఐ కీలక నిర్ణయం



**హైదరాబాద్,అక్టోబర్ 9(పిసిడబ్ల్యూ న్యూస్):** కీలకమైన రెపో రేటును వరుసగా 10వ సారి 6.5 శాతంగా కొనసాగించాలని కేంద్ర బ్యాంక్ ఆర్బీఐ నిర్ణయించింది. ఈ మేరకు బుధవారంతో ముగిసిన మూడు రోజుల 'ద్రవ్య విధాన కమిటీ భేటీ'లో నిర్ణయం తీసుకున్నట్టు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ వెల్లడించారు.రెపో రేటును యథాతథంగా కొనసాగించాలంటూ ఆరుగురిలో ఐదుగురు సభ్యులు అనుకూలంగా ఓటు వేశారని ఆయన చెప్పారు. ఆర్థిక వృద్ధి, ద్రవ్యోల్బణం సమతుల్యతను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. ఇక ఎస్డీఎఫ్ (సస్టెయినబుల్ డిపాజిట్ ఫెసిలిటీ) రేటు 6.25 శాతం, ఎంఎస్ఎఫ్ (మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ) రేటు, సేవింగ్స్ రేటు 6.75 శాతంగా ఉన్నాయని శక్తికాంత్ దాస్ వివరించారు.

# మా తొలి ప్రాధాన్యం కాశ్మీర్‌కు రాష్ట్ర హోదానే...

- అధికారం చేపట్టగానే దీనిపైనే తీర్మానిస్తాం
- కాబోయే సిఎం ఒమర్ అబ్దుల్లా ప్రకటన



**శ్రీనగర్,అక్టోబర్ 9(పిసిడబ్ల్యూ న్యూస్):** జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ గెలుపు అనంతరం సీఎంగా ఒమర్ అబ్దుల్లా బాధ్యతలు చేపడతారని నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో పార్టీ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ.. జమ్మూకశ్మీర్‌లో ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే జమ్మూ-కశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇవ్వాలనే తీర్మానాన్ని ప్రధానికి సమర్పిసామన్నారు. నియోజకవర్గాల

వివరాలు 2లో

# ఎమ్మార్పీఎస్ ర్యాలీని అడ్డుకున్న పోలీసులు

**హైదరాబాద్,అక్టోబర్ 9(పిసిడబ్ల్యూ న్యూస్):**

హైదరాబాద్‌లోని పార్శిగుట్ట ఎమ్మార్పీఎస్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటుచే సుకుంది. ఎస్సీ వర్గీకరణ చేయకుండా డీఎస్సీ ఉద్యోగాలను భర్తీ చేయడంపై ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణతో పాటు నేతలు నిరసనకు దిగారు.పార్శిగుట్ట నుంచి ట్యాంక్ బండ్ వరకు ర్యాలీగా బయలుదేరగా, వారిని పోలీసులు అడ్డుకున్నా రు. అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేయగా ఉద్రిక్తత చోటుచేసుకుంది.



# రసాయన శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

- డేవిడ్ బెకర్, డెమిస్ హసబిస్, జాన్ ఎం.జంపర్‌ల ఎంపిక



**స్టాక్‌హోం,అక్టోబర్ 9(పిసిడబ్ల్యూ న్యూస్):** రసాయన శాస్త్రంలో విశేష పరిశోధనలు జరిపిన ముగ్గురు శాస్త్రవేత్తలకు ఈ ఏడాది నోబెల్ బహుమతి లభించింది. ప్రొటీన్ల డిజైన్లకు సంబంధించిన పరిశోధనలకుగానూ శాస్త్రవేత్తలు డేవిడ్ బెకర్, డెమిస్ హసబిస్, జాన్ ఎం.జంపర్‌ను ఈ ఏడాది నోబెల్ పురస్కారానికి ఎంపిక చేసినట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ వెల్లడించింది. కంప్యుటేషనల్ ప్రొటీన్ డిజైన్‌కుగానూ బెకర్, ప్రొటీన్ స్ట్రక్చర్ ప్రిడిక్షన్‌కు గానూ డెమిస్, జంపర్ ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. వైద్యవిభాగంతో మొదలైన నోబెల్ పురస్కారాల ప్రదానం అక్టోబర్ 14వరకు కొనసాగనుంది. సోమవారం వైద్యశాస్త్రంలో విజేతలను ప్రకటించగా.. నిన్న భౌతికశాస్త్రంలో నోబెల్ అవార్డులను ప్రకటించారు. ఈరోజు రసాయనశాస్త్రంలో నోబెల్‌కు పురస్కారానికి ఎంపికైన వారి జాబితా వెలువడింది. గురువారం సాహిత్యం విభాగానికి సంబంధించి ప్రకటన ఉంటుంది. శుక్రవారం రోజున నోబెల్ శాంతి బహుమతి అక్టోబర్ 14న అర్థశాస్త్రంలో నోబెల్ గ్రహీతల పేర్లను వెల్లడిస్తారు. స్వీడన్‌కు చెందిన శాస్త్రవేత్త, ఇంజినీర్, వ్యాపారవేత్త ఆల్‌ఫ్రెడ్ నోబెల్ పేరు మీదుగా ప్రపంచంలో వివిధ రంగాల్లో విశేష సేవలందించిన వారికి ఈ అవార్డును ప్రదానం చేస్తోన్న సంగతి తెలిసిందే.

# ఎన్నికల హామీలను ఎగ్గొట్టిన కాంగ్రెస్

- హామీలకు పైసలు లేకున్నా మూసీ ముచ్చటేందో
- రేవంత్ సర్కార్‌పై కెటిఆర్ విమర్శలు



**హైదరాబాద్,అక్టోబర్ 9(పిసిడబ్ల్యూ న్యూస్):**

అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు పైసలు లేవంట.. కానీ మూసీ ప్రక్షాళన కోసం రూ. లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేస్తాడంట.. అని రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండి పడ్డారు. కాంగ్రెస్ సీనియర్ లీడర్ మహమ్మద్ అలావుద్దీన్ పటేల్ సహా ఆయన అనుచరులు తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ జాబ్ పోగొట్టండి. మీకు ఏడాది లో 2 లక్షల ఉద్యోగాలంటూ రాహుల్ గాంధీ అశోక్ నగర్‌కు వచ్చి ఇది నా గ్యారంటీ అని హామీ ఇచ్చాడు. కానీ రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డికి తప్ప తెలంగాణ యువతకు ఉద్యోగాలు రాలేదని కేటీఆర్ తెలిపారు. మహిళలకు రూ. 2500 ఇస్తా అన్నాడు. కోటి 60 లక్షల మంది మహి ళలు రూ. 2500 ల కోసం వేచి చూస్తున్నారు. వృద్ధులకు రూ. 4 వేలు అన్నాడు. ఇంట్లో ఇద్దరికీ పింఛన్ అన్నాడు. ఒక్కరికన్నా వచ్చిందా? అంటే లేనే లేదు. ఉన్న రైతు బంధు, ఉన్న పింఛన్ కూడా వస్తలేదు. వాళ్లు 420 హామీలు ఇచ్చారు. ఇప్పుడు ఏమైనయ్ అంటే సమాధానం చెబుతలేదు. కళ్యాణ లక్ష్మి పేరుతో తులం బంగారం ఇస్తా అన్నాడు. తులం ఇనుము కూడా ఇవ్వడని కేటీఆర్ విమర్శించారు. సంక్షేమ పథకాల కోసం పైసలు ఇస్తే మీరు కమీషన్‌లు ఇవ్వరు కదా? అదే మూసీ ప్రాజెక్ట్ అయితే లక్షా కోట్లు మింగొచ్చు. రాహుల్ గాంధీ, వాళ్ల బావకు కోట్ల రూపాయలు దోచి పెట్టొచ్చు. మనం గల్లా పట్టి అడిగే వరకు ఈ కాంగ్రెస్ మోసం కొనసాగుతూనే ఉంటది. మనం ఏదైనా సమస్య వస్తే కలెక్టర్లకు చెప్పాలంట. ఇంటింటికి ఓట్ల కోసం వచ్చిన వాళ్లను మాత్రం అడగవద్దంట. ప్రజలకు ఏం ఖర్మ. ఎవరైతే మనకు తప్పుడు హామీలు ఇచ్చారో వాళ్లనే పట్టుకోవాలే. కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులను పట్టుకొని మనం అడగాలె అని కేటీఆర్ సూచించారు.

## 30 మేకలను దొంగిలించిన దొంగలు

**- కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు**

**జనగామ,అక్టోబర్ 9(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో దసరా పండగ అంటేనే మందు, మాంసంతో ఎంజాయ్ చేస్తారు. అందరి ఇళ్లలో పండగ రోజు మటన్, మద్యం లేకుండా ఉండదు. పండగ కోసం అప్పు చేసి మరీ.. కొనుకుంటారు. ఇదిలా ఉంటే.. మార్కెట్‌లో ఈ సమయంలో మేకలకు, గొర్రెలకు డిమాండ్ ఎక్కువ. ఒక్కో మేక, గొర్రె మామలు సమయం కన్నా.. వెయ్యి రెండు వేలు ఎక్కువనే పలుకుతుంది. ఎంత డిమాండ్ ఉన్నా.. కొనకుండా మాత్రం ఉండరు. అమ్మకందారులైతే.. పండగ సీజన్ అదునుగా చూసి ఎక్కువ ధరకు అమ్ముతుంటారు. ఏదో విధంగా అయితే.. దసరా పండగ రోజు మాత్రం ఇంట్లో మటన్ కర్రీ ఉండాల్సిందే..జనగామ జిల్లాలో దొంగలు హల్చల్ చేశారు. జిల్లా కేంద్రంలోని బీరప్ప గడ్డలో కెమిడి లక్ష్మయ్యకు చెందిన 30 మేకలను గుట్టుచప్పుడు కాకుండా కొట్టం నుండి అర్థరాత్రి గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. పండగ సమయంలో జిల్లాలో మేకల దొంగతనం కలకలం రేపుతున్నాయి. ఈ ఘటనపై బాధితుడు లక్ష్మయ్య పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. సుమారు నాలుగు లక్షల రూపాయల వరకు వాటి విలువ ఉంటుందని ఆవేదన చేందుతున్నాడు. కాగా.. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. దొంగలను వెతికే పనిలో ఉన్నారు.

## వరద బాధితులకు ఎల్ అండ్ టి భారీ విరాళం



**హైదరాబాద్,అక్టోబర్ 9(పిసిడబ్ల్యూ న్యూస్):**వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి నిధులు అందుతూనే ఉన్నాయి. తాజాగా ఎల్ అండ్ టీ సంస్థ రూ.5.50 కోట్ల భారీ విరాళం ఇచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టిను ఎల్ అండ్ టీ ఛైర్మన్ కలిసి ఇందుకు సంబంధించిన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సిఎం వారిని అభినందించారు.

## మహిళలకు సిఎం రేవంత్ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

**హైదరాబాద్,అక్టోబర్ 9(పిసిడబ్ల్యూ న్యూస్):** పూలను పూజించే గొప్ప సంస్కృతికి నెలవు తెలంగాణ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.. తీరొక్క పూలతో రూపొందించే ఘనమైన బతుకమ్మలతో ఆడిపాడే సంబురాల్లో అఖరి రోజైన సద్దుల బతుకమ్మను పురస్కరించుకుని తెలంగాణలోని అక్కాచెల్లెళ్లందరకీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా ట్యాంక్ బడ్ తో పాటు రాష్ట్రంలోని చెరువులన్నింటీ వద్ద ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

## రతన్ టాటా ఆరోగ్యం విషమం?

**ముంబయి,అక్టోబర్ 9(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రముఖ పారిశ్రామిక వేత్త, టాటా సన్స్ ఛైర్మన్ రతన్ టాటా ఆరోగ్య పరిస్థితి విషమించినట్లు తెలుస్తోంది. ముంబయిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతున్నట్లు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ వార్తా సంస్థ పేర్కొంది. రతన్ టాటా అస్వస్థతకు గురై ఓ ఆస్పత్రిలో చేరారంటూ సోమవారం వార్తలు వచ్చాయి. దీనిపై ఆయన అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్టు వెలువడింది. తాను బాగానే ఉన్నానని, ఆందోళన అవసరం లేదని పోస్టులో అందులో ఉంది. మరోసారి ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఈ వార్తలు రావడం గమనార్హం. దీనిపై టాటా గ్రూప్ నుంచి గానీ, ఆస్పత్రి వర్గాల నుంచి గానీ అధికారిక ప్రకటన వెలువడలేదు.

## కొడంగల్ మాజీ ఎమ్మెల్యే అరెస్టు

**హైదరాబాద్:అక్టోబర్ 9(పిసిడబ్ల్యూ న్యూస్):** కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని అరెస్టు చేశారు. ఫార్మా కంపెనీకి వ్యతిరేకంగా చేపట్టిన పాదయాత్రను అడ్డుకున్న పోలీసులు..ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఫార్మా కంపెనీకి వ్యతిరేకంగా రైతుల పక్షాన పోలెపల్లి ఎల్లమ్మ దేవస్థానం నుంచి దుద్యాల్ ఎమ్మార్వో ఆఫీసు వరకు పట్నం నరేందర్ రెడ్డి బుధవారం మహా పాదయాత్ర చేయాలని నిర్ణయించారు. పాదయాత్రకు అడ్డంకులు సృష్టించాలనే ఉద్దేశంతో తుంకిమెట్ల వద్ద పట్నం నరేందర్ రెడ్డి పోలీసులు అడ్డగించారు. పాదయాత్రకు అనుమతి లేదని చెబుతూ ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. పట్నం నరేందర్ రెడ్డితో పాటు మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని కొడంగల్ నుంచి పరిగి పోలీస్ స్టేషన్కు తరలించారు.



# సీఎం రేవంత్‌తో ఆదివాసీ సంఘాల భేటీ

**• మంత్రి సీతక్కతో కలసి వచ్చిన నేతలు**

**• సీఎం రేవంత్ దృష్టికి పలు సమస్యలు**

**హైదరాబాద్,అక్టోబర్ 9(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఆదివాసి సంఘాలు భేటీ అయ్యాయి. జూబ్లీహిల్స్ లోని సీఎం అధికారిక నివాసంలో బుధవారం భేటీ అయిన పలు సంఘాల ప్రతినిధులు..తమ ప్రాంత సమస్యలను సీఎంకి వివరించారు. జైనూరు ఘటన దరిమిలా ఆదివాసులు, మైనారిటీ వర్గాల మధ్య సఖ్యత కుదుర్చేందుకు ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఇరు వర్గాలతో ఇప్పటికే పలు దఫాలుగా చర్చలు జరిపారు. దీనికి కొనసాగింపుగా మంత్రి సీతక్క, ఎమ్మెల్యే బొజ్జు పటేల్ చొరవ తీసుకొని ఆదివాసి సంఘాలను తొడ్కొని సీఎం రేవంత్ రెడ్డి తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో తమ సమస్యలను ఆదిలాబాద్ ఆదివాసి సంఘాల ప్రతినిధులు



సీఎం దృష్టికి తీసుకువచ్చారు. స్థానికంగా తమకు ఎదురవుతున్న ఇబ్బందులను వివరిస్తూ వినతి పత్రాలు అంద చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీల హక్కులను కాపాడే విధంగా చర్యలు చేపట్టాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. తమ భూములు, ఉద్యోగాలు తమకే దక్కేలా చూడాలని కోరారు. ఆదివాసీల సమస్యలు సావధానంగా విన్న రేవంత్ రెడ్డి..దీపావళి లోపు సచివాలయంలో అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహిస్తామని, ఆ సమావేశానికి ఆదివాసి సంఘాలను, ముఖ్యులను ఆహ్వానిస్తామని, ఆ సమావేశంలోనే ఆదివాసీల డిమాండ్ల సాధ్యసాధ్యాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని ఆదివాసి సంఘాలకు హామీ ఇచ్చారు. ఆదిలాబాద్ కలెక్టర్ గా పనిచేసి అక్కడి సమస్య పట్ల పూర్తి అవగాహన ఉన్న దివ్య దేవరాజన్ ను అక్కడికి పంపించి చేపట్టాల్సిన చర్యలపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ఎంతోకాలంగా పెండింగ్లో ఉన్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించెందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నందున ప్రభుత్వానికి సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదివాసి సంఘాల ప్రతినిధులకు సూచించారు. ఈ సందర్భంగా తమ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి, సమస్యను పరిష్కరించే దిశలో చూపి సీఎంతో సమావేశం ఏర్పాటు చేసిన మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, అదిలాబాద్ కాంగ్రెస్ పార్లమెంట్ ఇంచార్జ్ ఆత్రం సుగుణకు ఆదివాసీ సంఘాల ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

## మా తొలి ప్రాధాన్యం కాశ్మీర్‌కు రాష్ట్ర హోదానే...

(మొదటి పేజీ తరువాయి)

పునర్విభజన, ఎన్నికలు, రాష్ట్ర హోదా వరుసగా ఉంటాయన్నారు. కొందరు నేతలు జమ్మూకశ్మీర్‌ను దిల్లీతో పోల్చడంపై ఆయన మండిపడ్డారు. కశ్మీర్‌ను దిల్లీతో పోల్చవద్దని..ఎందుకంటే దేశ రాజధానికి రాష్ట్ర హోదా ఇస్తామని ఎవరూ చెప్పలేదన్నారు. కానీ కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని ప్రధాని, హోంమంత్రి, భాజపా సీనియర్ మంత్రులు చెప్పారని పేర్కొన్నారు. 2019 వరకు జమ్మూకశ్మీర్ రాష్ట్రంగానే ఉందన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కశ్మీర్‌లో శాంతిని నెలకొల్పడం, అభివృద్ధికి బాటలు వేయడం కోసం రాష్ట్ర హోదా తప్పనిసరి అని పేర్కొన్నారు. కశ్మీర్‌లో ఉన్న రాజకీయ పార్టీలను భాజపా లక్ష్యంగా చేసుకొని.. బలహీనపరచడానికి ప్రయత్నించిందని దుయ్యబట్టారు. కానీ ఆ పార్టీ ఎత్తులు ఫలించలేదన్నారు. ముఖ్యమంత్రిగా తన పేరును తన తండ్రి ప్రకటించడంపై ఒమర్ అబ్దుల్లా స్పందిస్తూ.. నేషనల్ కాన్ఫరెన్స్ శాసనసభా పక్ష సమావేశం అనంతరం మిత్రపక్షాలతో చర్చలు జరిపి ఈవిషయంపై నిర్ణయం తీసుకుంటామన్నారు. జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేయడంతో 2019లో ప్రత్యేక ప్రతిపత్తి హోదాను కోల్పోయింది. దీంతోపాటు ఆ రాష్ట్రం రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా మారిపోయింది. జమ్మూకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా కల్పించాలన్నది ఫరూక్ అబ్దుల్లా నేతృత్వంలోని నేషనల్ కాన్ఫరెన్స్ డిమాండ్ చేస్తోంది. ఒమర్ అబ్దుల్లా కూడా గత అయిదేళ్లుగా అందుకోసమే తీవ్రంగా శ్రమిస్తున్నారు. కేంద్ర పాలిత ప్రాంతంగా ఉన్నంతవరకూ జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో అడుగుపెట్టబోనని అన్న ఒమర్.. యూటర్న్ తీసుకొని, అసెంబ్లీ ఎన్నికల్లో రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేసి విజయం సాధించారు. కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించే వరకు తన ప్రయత్నాన్ని విరమించుకోనని పట్టుదలతో ఉన్నారు.

## ఎస్సీ వర్గీకరణ అమలుకు నిర్ణయం

**• ఏకసభ్య కమిషన్ ఏర్పాటుకు సిఎం ఆదేశం**

**హైదరాబాద్,అక్టోబర్ 9(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలు కోసం 60 రోజుల్లో నివేదిక ఇచ్చేలా ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆ నివేదిక వచ్చాకే కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని నిర్ణయించారు. 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోవాలని సీఎం సూచించారు. 24గంటల్లో కమిషన్‌కు కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఉన్నత అధికారులను ఆదేశించారు. నిర్ణీత గడువులోగా ఏకసభ్య కమిషన్ నివేదిక సమర్పించాలని సూచించారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణపై గత కొంత కాలంగా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీనిపై ఇప్పటికే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. వివిధ అంశాలపై చర్చించిన క్యాబినెట్ సబ్ కమిటీ.. నాలుగోసారి సమావేశమై ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఏకసభ్య న్యాయ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ నేపథ్యంలో బుధవారం సీఎం రేవంత్ రెడ్డి, క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులు, ఇతర అధికారులు సమావేశమై చర్చించి ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. కేబినెట్ సబ్ కమిటీ సూచనల ఆధారంగా ముందుకు వెళ్లాలని ఆదేశించారు. ఎస్సీ వర్గీకరణపై 60 రోజుల్లో వన్ మెన్ కమిషన్ రిపోర్ట్ సమర్పించాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. వన్ మెన్ కమిషన్ రిపోర్ట్ సమర్పించాకే కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

## మండలి చీఫ్‌విప్‌గా పట్నం బాధ్యతలు స్వీకరణ

**• అభినందనలు తెలిపిన పలువురు నేతలు**

**హైదరాబాద్,అక్టోబర్ 9(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర శాసనమండలి చీఫ్ విప్ గా డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి బాధ్యతలను స్వీకరించారు. అసెంబ్లీ సెక్రటరీ నరసింహచార్యులు సమక్షంలో బాధ్యతలను స్వీకరించారు.అనంతరం మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలవగా, ఆయన మహేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. వాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్,ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, ప్రకాష్ గౌడ్ ,ఈర్లపల్లి శంకర్, మల్ రెడ్డి రంగారెడ్డి, మ్మెల్సీలు కోదండరాం, బల్మూరి వెంకట్, ఎగ్గే మల్లేష్, భాను ప్రకాష్, ప్రభాకర్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి, వికారాబాద్ జిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్ పట్నం సునీత మహేందర్ రెడ్డి,హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలకు చెందిన నాయకులు వజ్రేష్ యాదవ్ , చరణ్ కౌశిక్ యాదవ్ , పరమేశ్వర్ రెడ్డి రామ్మోహన్ గౌడ్, రోహిన్ రెడ్డి కొలను హనుమంత్ రెడ్డి, భీమ్ భరత్, పట్నం రినీష్ రెడ్డి, తదితరులు మహేందర్ రెడ్డి ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



## 2028 డిసెంబర్ వరకు ఉచిత బియ్యం పంపిణీ

**• ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్నయోజన కింద ఫోర్టిఫైడ్ రైస్**

**• లోథాల్‌లో 'నేషనల్ మారిటైమ్ హెరిటేజ్ కాంప్లెక్స్' అభివృద్ధి**

**• కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయం**

**న్యూఢిల్లీ,అక్టోబర్ 9(పిసిడబ్ల్యూ న్యూస్):** పేదల కోసం కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఢిల్లీలో సమావేశమైన కేంద్ర మంత్రి వర్గం ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్నయోజనతో పాటు ఇతర సంక్షేమ పథకాల కింద ఇక నుంచి ఫోర్టిఫైడ్ బియ్యాన్ని మాత్రమే పంపిణీ చేయాలని నిర్ణయించింది. గరీబ్ కల్యాణ్ యోజన పథకాన్ని 2028 డిసెంబర్ వరకు పొడిగించారు. అంటే అప్పటి వరకూ పేదలకు ఉచితంగా ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరా చేస్తారు. కేంద్రం వందశాతం నిధులతో పోషకాహారం అందించేందుకు వీటిని సరఫరా చేయాలని నిర్ణయించారు. 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రధాని నరేంద్ర దేశ ప్రజలందరికీ పౌష్టికాహార హామీ ఇచ్చారు. ఈ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. దేశవ్యాప్తంగా ఆహార భద్రతలో భాగంగా ఉచితంగా బియ్యం/ఆహారధాన్యాలు అందించేందుకు ఉద్దేశించిన ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజనతోపాటు సంబంధిత పథకాలను కేంద్రం పొడిగించింది. 2028 డిసెంబరు వరకు ఉచిత బియ్యం పంపిణీ పథకాలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటి కోసం రూ. 17,082 కోట్లు ఖర్చు చేయనున్నట్లు కేంద్రం తెలిపింది. రాబోయే పండగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంది. లోథాల్‌లో 'నేషనల్ మారిటైమ్ హెరిటేజ్ కాంప్లెక్స్' అభివృద్ధికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాజస్థాన్, పంజాబ్ సరిహద్దుల్లో రూ.4,406 కోట్లతో 2280 కి.మీ మేర రోడ్ల నిర్మాణానికి అంగీకరించింది. దేశంలో రక్తహీనత, సూక్ష్మపోషకాల లోపాలను అరికట్టేందుకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రధానమంత్రి పోషణ్ అనే పథకం అమల్లో ఉంది. సాధారణ బియ్యంలో పోషకాలను జోడిస్తే ఫోర్టి÷డ్ రైస్ అవుతుంది. పోషక విలువలు పెంచేందుకు కృత్రిమ విటమిన్లు, సప్లిమెంట్లు కలపడాన్నే ఫార్టి÷డ్ రైస్‌గా చెప్పుకోవచ్చు. ఆహారాన్ని బలవర్థకం చేయడమే లక్ష్యం. బియ్యం, ఇతర ఆహార ధాన్యాలలో ఫార్టి÷డ్ రైస్ కెర్నెల్స్ కలిపి సరఫరా చేయడం ద్వారా పోషకాహార లోపాన్ని నివారిస్తామని కేంద్రం ఇప్పటికే తెలిపింది. కొన్ని జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. బియ్యాన్ని పిండిగా మార్చి దానికి ఐరన్, జింక్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి-12 వంటి విటమిన్లు, పోషకాలను కలిపి అనంతరం ఆ పిండిని కెర్నెల్స్‌గా మార్చేస్తారు. ఇలా తయారు చేసే పరిశ్రమలు దేశవ్యాప్తంగా పరిమితంగా ఉ?నాయి. ఆయా పరిశ్రమల నుంచి మిల్లర్లకు కేంద్రం ఈ ఫోర్టిఫైడ్ రైస్ కెర్నెల్స్ సరఫరా చేస్తుంది. ప్రతి క్వింటాలు బియ్యానికి 1 కిలో ఫార్టి÷డ్ రైస్ కెర్నెల్స్ కలిసేలా ఇప్పటికే ప్రత్యేక యంత్రాలు కూడా ఉన్నాయి. అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం, ప్రజాపంపిణీ బియ్యం.. ఇలా దశలవారీగా అన్ని సంక్షేమ పథకాల ద్వారా బలవర్థక ఆహారం సరఫరా చేయాలని కేంద్రం పట్టుదలగా ఉంది. రాజస్థాన్, పంజాబ్ దేశ సరిహద్దు ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి రూ.4,406కోట్లు కేటాయించారు. 2,208 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పాకిస్థాన్‌తో సరిహద్దు కలిగిన ప్రాంతాల్లో సరిహద్దు గ్రామాలకు కనెక్టివిటీ పెంచుతారు. హైవేతో అనుసంధానం చేయడం ద్వారా సరిహద్దు గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తారు.

## ఢిల్లీ ఎన్నికల్లో మాది ఒంటరి పోరు

**• తేల్చి చెప్పిన ఆమ్ ఆద్మీ పార్టీ**




**న్యూఢిల్లీ,అక్టోబర్ 9(పిసిడబ్ల్యూ న్యూస్):**రానున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ నిర్ణయించినట్లు ఆ పార్టీ ప్రతినిధి ప్రియాంక కక్కర్ బుధవారం ప్రకటించారు. బీజేపీని ఒంటరిగా ఎదుర్కోగలిగే సామర్థ్యం ఆప్‌కు ఉందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అతి విశ్వాసం వల్లే హర్యానాలో చుక్కెదురైందని పేర్కొన్నారు. భాగస్వామ్య పక్షాలను హర్యానా ఎన్నికల్లో కాంగ్రెస్ పట్టించుకోలేదని, వారికి అతివిశ్వాసం మితిమీరడంతోనే చివరకు ఓటమి చవిచూడాల్సి వచ్చిందని ఆరోపించింది. ఢిల్లీలో పదేళ్లుగా ఒక్క అసెంబ్లీ సీటు గెలవని కాంగ్రెస్‌కు ఇటీవల లోక్‌సభలో మూడు సీట్లు ఇచ్చామని.. అయినప్పటికీ హర్యానా ఎన్నికల్లో మిత్రపక్షాలకు తోడుగా నిలవలేదని ఆప్ విమర్శించింది. హర్యానా ఎన్నికల్లో పొత్తు కోసం ఇండియా కూటమి చేసిన ప్రయత్నాలన్నింటినీ కాంగ్రెస్ తుంగలో తొక్కిందని మండిపడింది. హర్యానా ఎన్నికల ఫలితాలు ఇండియా కూటమిలో చీలికలు తెచ్చేలా కనిపిస్తోంది. హర్యానా ఎన్నికలకు ముందే కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకునేందుకు ఆప్ తీవ్ర ప్రయత్నం చేసింది. కానీ హస్తం పార్టీ మాత్రం.. రెండు, మూడు సీట్లు కంటే ఎక్కువ ఇవ్వలేమని తేల్చి చెప్పడంతో ఆమ్ ఆద్మీ పార్టీ ఒంటరిగా బరిలోకి దిగింది. ఇక కాంగ్రెస్ ఒంటరిగానే అధికారంలోకి వస్తామని ఓవర్ కాన్ఫిడెన్స్‌తో బరిలోకి దిగింది. కానీ అంచనాలన్నీ తలకిందులయ్యాయి. అనూహ్యంగా బీజేపీ అధికారంలోకి వచ్చింది. దీంతో ఇండియా కూటమిలో లుకలుకలు మొదలయ్యాయి.

# డిఎస్సీ ఫలితాలలో బిసిలకు తీవ్ర అన్యాయం

● బొమ్మ ప్రవల్లిక అమర్ నేత ● 5 శాతం ఉన్న ఓసీలకు 10 శాతం అమలు చేయడం రాజ్యాంగ విరుద్ధం! ● ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీలో బీసీ యువతకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిద్దాం,.. ● సీఎం రేవంత్ రెడ్డి బీసీ బిడ్డలకు అన్యాయం జరగకుండా చూడాలి



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 9(పిసిడబ్ల్యు న్యూస్):** ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డిఎస్సీ ఫలితాలలో బిసిలకు తీవ్రమైన అన్యాయం జరిగిందని తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ రాజకీయ విభాగం ప్రధాన కార్యదర్శి బొమ్మ ప్రవల్లిక అమర్ నేత ఆందోళన వ్యక్తం చేశారు. ఓవైపు బిసిలకు అన్ని రంగాలలో అన్యాయం జరుగుతోందని ఉద్యమాలు జరుగుతున్న వేళ కూడా డిఎస్సీ ఫలితాలతో అది తేట తెల్లమైందన్నారు. గత ప్రభుత్వం తీసుకున్న విధానాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజ ప్రభుత్వం కూడా అనుసరించడం వల్ల బిసిలకు తీరని నష్టం జరుగుతోందన్నారు. గత ప్రభుత్వం తీసుకున్న కొన్ని అసంబద్ధ నిర్ణయాలను మార్చుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో కూడా చొరవ చూపాలని ఆమె కోరారు. ఉద్యోగం అంటే ఒక వ్యక్తి జీవితానికి సంబంధించిన విషయమని గుర్తు చేశారు. బిసిలకు ఈడబ్ల్యుసి కోటా మీద ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ బిసిలకు, ఎస్సీ ఎస్టీ లకు కూడా రాని మార్కులతో ఈడబ్ల్యుఎస్ కోటా కింద ఉన్నత వర్గాలు ఉద్యోగాలు పొందడం సామాజిక న్యాయ సూత్రాలకు పూర్తి విరుద్దం. అసలు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు గత ప్రభుత్వం అమలు చేసిన విధానానికి ఎలాంటి సంబంధం లేదు. రాజ్యాంగం ప్రకారం మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించొద్దు. కానీ అనేక రాష్ట్రాలు అంతకు మించి అమలు చేస్తున్నాయి. తెలంగాణలో అంతకు మించి అమలు కాకపోయినా ఈడబ్ల్యుఎస్ కోటా ముసుగులో తెలంగాణ వ్యాప్తంగా బిసిలు వెయ్యి ఉపాధ్యాయ ఉద్యోగాలు కోల్పోతున్నారు. అంతే కాకుండా బిసి, ఎస్సీ ఎస్టీ ల అభ్యర్థుల కంటే తక్కువ మార్కులు వచ్చిన వాళ్లు ఉద్యోగాలు పొందడం ఏ రాజ్యాంగ మౌలిక సూత్రాలను అమలు చేయడమో ప్రభుత్వం తెలియజేయాలని ఆమె డిమాండ్ చేశారు. తెలంగాణలో మొత్తం ఉద్యోగాలలో ఈడబ్ల్యుఎస్ కోటా కింద కేవలం 110 ఉద్యోగాలు మాత్రమే అందాలి. కాని 1110 ఉద్యోగాలు అందుతున్నాయి. దాని వల్ల అనగారిన వర్గాలు 1000 ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బిసి గణన పూర్తయ్యే వరకు ఆపాలని కోరారు. ఇంత కాలం ఆగిన బిసిలు రెండు మూడు నెలలు ఆగడం పెద్ద సమస్య కాదన్నారు. ఇప్పటికిప్పుడు ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ అవసరం లేదని అనడం లేదు. కానీ త్వరగా కుల గణన చేపట్టి, ఉద్యోగాలు భర్తీ చేయాలి. లేకుంటే కేవలం 5 శాతం వున్న ఓసిలకు 10 శాతం అమలు చేయడమే రాజ్యాంగ విరుద్ధం. అందులో నూటికి పది శాతం అమలు చేయడం మరీ దుర్మార్గం. ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీలో తెలంగాణ బిసి యువత జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించండి. ఇక్కడ మరో అంశం దాగి వుంది. ఈడబ్ల్యుఎస్ కోటా కింద కోల్పోయిన ఉద్యోగాలలో బిసి, ఎస్సీ ఎస్టీ మహిళలు 500కి కొలువులు రాకుండా పోతున్నారు. అనగారిణ వర్గాలకు ఇలా రెండు రకాలుగా అన్యాయం జరగడం సరైంది కాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రిగా వున్నారు. బిసి బిడ్డలకు అన్యాయం జరగకుండా చూడాలని ప్రవలిక విజ్ఞప్తి చేశారు.

# పత్తి కొనుగోలు త్వరగా ప్రారంభించాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి, అక్టోబర్ 9 (పిసిడబ్ల్యు న్యూస్):** జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం జిల్లా మార్కెట్ అధికారి కే. సురేఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సీసీఐ పత్తి కొనుగోలు జరుపుటకు ముందస్తు ఏర్పాట్లలో భాగంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి .సంధ్యారాణి, వ్యవసాయ శాఖ అధికారి అనురాధసీసీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ అరుణ్ దేవా,జిల్లా ట్రాన్సుపోర్ట్ అధికారి జైపాల్ రెడ్డి వివిధ రైతు సంఘ నాయకులు ,కాటన్ ఛాంబర్ బాద్యులు వీర రావు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలోజిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పత్తి కొనుగోళ్ల విషయం లో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులని ఆదేశించారు.రైతు పండించిన పత్తిని కొనుగోలు ప్రక్రియలో రైతుకు నష్టం జరగకుండా చూడాలని అన్నారు.రైతు పండించిన పంటలో సన్నకారు రైతులకు కూడా లాభం జరిగేలా ,రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలని, రైతు తను పండించిన పంట సంతృప్తి ఇచ్చేలాదిలా ఉండాలని జిల్లా కలెక్టర్ అన్నారు.పత్తి కొనుగోలు పారదర్శకంగా జరగాలని రైతు సంఘం నాయకులు కోరిక మేరకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అన్నారు.వివిధ రైతు సంఘం నాయకుల అభ్యర్థన మేరకు త్వరగా పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లాలోని మార్కెట్ కార్యదర్శిలు,నర్సంపేట జి.రెడ్డి నాయక్,వరంగల్ నిర్మల,వర్ధన్న పేట శ్రీనివాస్, నెక్కొండా కృష్ణ మీనన్ రావు,కౌలు రైతుల హక్కుల నాయకుడు భీరం రాములు, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకుడు మొగిలి ప్రతాపరెడ్డి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన రాజస్వ మండల అధికారి కార్యాలయం ప్రారంభం

● జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**మంచిర్యాల,అక్టోబర్ 9 (పిసిడబ్ల్యు న్యూస్):**ప్రజల సౌకర్యార్థం జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో నూతన రాజస్వ మండల అధికారి కార్యాలయాన్ని ప్రారంభించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం మంచిర్యాల పట్టణంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో మంచిర్యాల రాజస్వ మండల అధికారి కార్యాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి వి.రాములు, ఎ.సి.పి. ప్రకాష్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు వేగవంతమైన సేవలు అందించడం జరుగుతుందని, ఇందులో భాగంగా ప్రజలకు మరింత సౌకర్యవంతంగా అన్ని ఏర్పాట్లతో నూతన రాజస్వ మండల అధికారి కార్యాలయాన్ని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, తహశిల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**హనుమకొండ ప్రతినిధి, అక్టోబర్ 9 (పీసీడబ్ల్యు న్యూస్):** హనుమకొండ సుబేదారి ఎమ్మెల్యే నివాసం నందు 45వ డివిజన్ పరిధిలోని తరాలపల్లి గ్రామానికి చెందిన అనారోగ్యానికి గురి అయ్యాయి నేడు సిఎంఆర్ఎఫ్ ద్వార లబ్ధి పొందిన సిహెచ్.శ్రీనివాస్, బి.శ్రీధర్, కే.సవిత నేడు సుమారు 2లక్షల రూపాయల విలువ చెక్కులను వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు మాట్లాడుతు.. ఆరోగ్య శ్రీ పథకం ద్వారానే కాకుండా ఆరోగ్య శ్రీ పథకం వర్తించని వ్యాధులకు, పేదలను ఆదుకోవడం కోసం సిఎం రేవంత్ రెడ్డి లక్షల రూపాయలను మంజూరు చేస్తున్నారని ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు అన్నారు.ప్రజా సంక్షేమం కోసం.. ప్రభుత్వం రూపొందించిన పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పిలుపునిచ్చారు. దేశంలో ఎక్కడలేని విధంగా మన రాష్ట్రములో ప్రజాకర్షక పథకాలను రూపకల్పన చేసిన సిఎం రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా బంగారు తెలంగాణ నిర్మాణమే ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంజూరు చేసిన సిఎం రేవంత్ రెడ్డి కి ఎమ్మెల్యే శ్రీ కెఆర్ నాగరాజు కి లబ్ధిదారులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 45వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కర్ర హరీష్ రెడ్డి, యాదవరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు భాషీర్, యూత్ నాయకులు డేవిడ్, మోరిస్ తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతి మాతగా భద్రకాళి అమ్మవారు



**వరంగల్ ప్రతినిధి, అక్టోబర్ 9 (పిసిడబ్ల్యు న్యూస్):** వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధి గాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో శ్రీ భద్రకాళి దేవీ శరన్నవరాత్ర మహోత్సవములు ఏడవ రోజుకు చేరుకున్నాయి. ఏడవ రోజు కార్యక్రమాలలో భాగంగా ఉదయం గంటలు 04-00లకు అర్చకులు నిత్యాహ్నికం నిర్వర్తించి అమ్మవారిని సరస్వతీమాతగా అలంకరించడానికి ఆంగీకార ప్రార్థన జరిపి సూచన వచ్చిన వెంటనే అమ్మవారిని సరస్వతీమాతగా అలంకరించి పూజారాధనలు జరిపారు. ఈ రోజు అమ్మవారు సాధకుడి బుద్ధిలోకి ప్రవేశిస్తుంది. సరస్వతీ మాతగా అలంకరింపబడిన అమ్మవారి దర్శనం వల్ల సాధకుడికి సకల విద్యలు సమకూరుతాయని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ భద్రకాళి శేషు తెలిపారు. ఈ రోజు అమ్మవారికి రథసేవ జరిపారు. శరీరాన్ని రథంతో పోలుస్తారు. రథసేవలో సేవింపబడుతున్న అమ్మవారి రథాన్నిలాగితే ఈ జీవన రథం అనేది బాగా సాగుతుందని నమ్మకం. అందుకు అనేకమంది భక్తులు పోటీపడుతూ రథాన్ని లాగారు. నవరాత్ర కల్పాన్ననుసరించి కాళరాత్రి మరియు రక్త బీజహా దుర్గా క్రమంలో అమ్మవారికి పూజారాధనలు జరిపారు.రేపు మహాష్టమి దుర్గాష్టమి భద్రకాళి అమ్మవారి జన్మోత్సవం. ఆదిపరాశక్తి భద్రకాళిగా కోటి యోగిని గణములతో ప్రాదుర్భావం చెందిన రోజు. బతుకమ్మ కూడా దుర్గాష్టమినాడే జన్మించిందని ఆనాడే చద్దులు చేయడమనేది తరతరాలుగా వస్తున్న సంప్రదాయం.ఈ రోజు కార్యక్రమాలకు శ్రీ యాదా సత్యదీప్-ప్రవల్లి దంపతులు, శ్రీ కటకం సత్యనారాయణ-రంగమణి దంపతులు, శ్రీ కటకం సాయినీలేష్, శ్రీ రామా రాకేశ్-రమ్య దంపతులు, శ్రీ ఆకవరం వెంకట్ రెడ్డి-సృజన దంపతులు, సాయి మణికంఠ రెడ్డి, సోమనరసింహ రెడ్డి-పున్రెడ్డి కృష్ణా రెడ్డి రజని దంపతులు, బుచ్చమ్మ, శ్రీ బొల్లమ్ వెంకటేశ్వర్లు-సునీత దంపతులు, డాక్టర్ సనత్ కుమార్, డాక్టర్ సాహితి రమ్య, డాక్టర్ వైష్ణవి, శ్రీ పింగిలి పవన్ రెడ్డి %-% శ్రీలత దంపతులు, డాక్టర్ ప్రణీత్ కుమార్, డాక్టర్ రూపశ్రీ దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. ఉబయ దాతలకు పూజానంతరం అమ్మవారి శేషవస్త్రములు బహూ కరించి ప్రసాదములు ఆందజేశారు.ఈరోజు ఆలయాన్ని సందర్శించిన ప్రముఖులలో ఎమ్మెల్సీ శ్రీ బస్వరాజు సారయ్య తదితరులు ఉన్నారు.అనంతరం సాయంకాలం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతో అలరించాయి. భద్రకాళి భక్త సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు ఉదయం నుండి రాత్రి వరకు ప్రసాద వితరణ జరిపారు.

# సరస్వతి దేవి రూపంలో దర్శనం ఇచ్చిన దుర్గమ్మ...

● భరతనాట్యంతో అలరించిన చిరంజీవి మహతి....



**బయ్యారం,అక్టోబర్ 9 (పిసిడబ్ల్యు న్యూస్):** బయ్యారం మండల వ్యాప్తంగా దుర్గాదేవి శరన్నవరాత్రి రోజుల్లో భాగంగా ఏడవ రోజు అయిన అమ్మవారి రూపం మూల నక్షత్రం సాక్షాత్తు సరస్వతి దేవి రూపంలో దుర్గాదేవి దర్శనమిచ్చారు. మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామచంద్రస్వామి దేవస్థానం, గాంధీ సెంటర్, కొత్తపేట, వెంకట్రాంపురం, కొత్తగూడెం మరియు ఇతర గ్రామాలలో ఘనంగా నవరాత్రి ఉత్సవాలు దుర్గాదేవిని స్మరించుకుంటూ అంగరంగ వైభవంగా అత్యంత భక్తి శ్రద్ధలతో భక్తులు తమ పూజా విధానాలను నిర్వహించుకుంటున్నారు. అందులో సరస్వతి దేవి మూలా నక్షత్రంలో ఉద్భవించినందున ఆ రూపంలో దర్శనమిచ్చారు. ఈ రూపాన్ని దర్శించడానికి విద్యార్థిని, విద్యార్థులు ఉద్యోగులు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని కోదండ రామచంద్ర స్వామి దేవస్థానం లో నవదుర్గ రూపంలో కుమారి మహతి భరతనాట్యం అలరించింది. నవరాత్రుల సందర్భంగా అమ్మవారి మాలధారుల సంఖ్య గణనీయంగా పెరిగిందని దేవస్థానం అర్చకులు సుదర్శనాచార్యులు తెలిపారు.



# పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ పోస్టల్ డే, బతుకమ్మ వేడుకలు




**హనుమకొండ ప్రతినిధి, అక్టోబర్ 9 (పీసీడబ్ల్యు న్యూస్):** భారతీయ పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో 7తారీకు నుండి 11తారీకు వరకు నేషనల్ పోస్టల్ వీక్ సెలెబ్రేషన్స్ జరుపుకుంటున్న నేపథ్యంలో అందులో భాగంగా హనుమకొండలోని హెడ్ పోస్ట్ ఆఫీస్ లో నేషనల్ పోస్టల్ డే ఘనంగా జరుపుకున్నారు. ఫిట్ పోస్ట్ ఫిట్ ఇండియా అంటూ హెడ్ పోస్ట్ ఆఫీస్ నుండి పబ్లిక్ గార్డెన్ వరకు ర్యాలీ తీసారు. చాలా అరుదుగా నేషనల్ పోస్టల్ డే, బతుకమ్మ పండుగా రెండు ఒకే సారి రావడంతో హెడ్ పోస్ట్ ఆఫీస్ లో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమం లో హనుమకొండ పోస్టల్ డివిజన్ ఎఎస్పి రమాదేవి, హనుమకొండ హెడ్ పోస్ట్ మాస్టర్ కె.వి పవన్ కుమార్, పోస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన బాలల పూజ

- దేవీ నవరాత్రులలో బాలల పూజ అందరినీ ఆకట్టుకుంది



**హైదరాబాద్ ప్రతినిధి,అక్టోబర్ 9(పిసీడబ్ల్యు న్యూస్):** సంవత్సరంలో ఒకేసారి మహిళలకు వచ్చే అతిపెద్ద పండుగ బతుకమ్మ సంబరాలు. మహిళలు అత్యంత బిజీగా ఉండే 27 రోజులు, మొదటి తొమ్మిది రోజులు గణపతి నవరాత్రులు మరో తొమ్మిది రోజులు బొడ్డెమ్మ సంబరాలు చివరి తొమ్మిది రోజులు దేవీ నవరాత్రులు మహిళలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచే పండుగలు ఇవి. దేవీ నవరాత్రులలో రోజుకు ఒక అవతారాన్ని సందర్శిస్తారు భక్తులు అందులో భాగంగానే బాలల పండుగను జరుపుకుంటారు. హైదరాబాద్ పట్టణంలోని యాదగిరి నగర్ లో లక్ష్మీ రామారావు గృహంలో 16 మంది చిన్నారులతో వారి స్వగృహంలో బాలల పూజ నిర్వహించారు. రాజేష్ తల్లిదండ్రులతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలిసారి ఇలాంటి పండుగ జరుపుకోవడంతో చిన్నారులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. రానున్న పండుగలలో చిన్నారులతో మరెన్నో కార్యక్రమాలు నిర్వహించాలని వారు కోరారు.

# బాధిత కుటుంబాలకు చల్మెడ పరామర్శ...

**వేములవాడ, అక్టోబర్ 09 (పిసిడబ్ల్యు న్యూస్):** చందుర్తి మండలం బండపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్త కోరే మల్లేశం భార్య కోరే క్యాతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను, అలాగే చింతపల్లి మునీందర్ కుమారుడు కౌశిక్ కు ఇటీవల ప్రమాదంలో కాలుకు గాయం కాగా వారిని, అలాగే కార్యకర్త గసికంటి రామస్వామి అనారోగ్యంతో బాధపడుతుండగా వారిని బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు. పరామర్శించి సంతాపాన్ని తెలియజేశారు. వారి వెంట మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, ప్యాక్స్ చైర్మన్ కిషన్ రావు, రమేష్ రావు, లక్ష్మణ్, చిలువేరి రవి, స్వామి, సత్తయ్య న్యాత సురేష్, గొర్రె రామస్వామి, పొక్కిలి దేవయ్య,తదితరులు ఉన్నారు.



## మృతుని కుటుంబానికి ఆత్మీయ పరామర్శ



**చిట్యాల, అక్టోబర్ 9 (పీసిడబ్ల్యూ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రానికి చెందిన బుర్ర మహేష్ గౌడ్ ఇటీవల గుండెపోటుతో మరణించారు. కాగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్ మృతుని చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబాన్ని పరామర్శించి..తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసి..ఓదార్చారు. మృతుడు మహేష్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని, సర్గలోక ప్రాప్తిరస్తు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చిట్యాల మాజీ జడ్పిటిసి గొర్రె సాగర్, బీఆర్ఎస్ నాయకులు పిట్ట సురేష్, కట్కూరి రాజేందర్, ములుగురి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## దాదా సాహెబ్ మన్యవార్ కాన్షిరాం వర్ధంతి

### - నివాళులు అర్పించిన గ్యారా గోవర్ధన్



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా,ఆక్టోబర్ 9,(పిసిడబ్ల్యూ న్యూస్):**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మేడ్చల్ అసెంబ్లీ ఆధ్వర్యంలో పోచారం మున్సిపాలిటీ కొర్రెముల గ్రామం లోని కూడలి లో దాదా సాహెబ్ మన్యవార్ కాన్షీరామ్ 18వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి గ్యారా గోవర్ధన్,బాంసెట్ లీడర్ సుల్తాన్ రావు, మరియు బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు చిరంజీవి, రమేషు, నీరుడు సాయి, రమణయ్య మొదలైన నాయకులు పాల్గొనడం జరిగింది.

## దొడ్డా శేషగిరిరావుకి నివాళు లర్పించిన ఎమ్మెల్యే జారె



**దమ్మపేట, అక్టోబర్ 9(పిసిడబ్ల్యూ న్యూస్):** దమ్మపేట మండలంతాటి సుబ్బన్నగూడెం గ్రామంలో అనారోగ్య సమస్యతో మరణించినతాటి సూరిబాబు భౌతిక కాయానికి పూలదండ వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. అనంతరం మొద్దులగూడెం గ్రామంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు దొడ్డా శేషగిరిరావు అనారోగ్యంతో మరణించగా వారి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే శ్రీరామపురం గ్రామంలో కంభంపాటి వెంకటేశ్వరరావు అనారోగ్యంతో మరణించగా భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు స్థానిక నాయకులు గ్రామ కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాల పునర్నిర్మాణానికి ఆల్ఫోర్స్ అధినేత ఉదారత

**రామడుగు, అక్టోబర్ 9 (పిసీడబ్ల్యూ న్యూస్):** రామడుగు మండలం గోపాల్ రావుపేట గ్రామంలో పునర్నిస్తున్న హనుమాన్, నల్ల పోచమ్మ, గ్రామ పోచమ్మ దేవాలయాల నిర్మాణానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ ఊట్కూరి నరేందర్ రెడ్డి భారీ విరాళం అందజేసి తన ఉదారతను మరోసారి చాటుకున్నారు. ఈ బుధవారం గోపాల్ రావు పేట గ్రామంలో ఆలయ కమిటీ సభ్యులకు 2లక్షల 22వేల 2వందల ఇరవై రెండు రూపాయల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూగ్రామస్తులు అడగగానే స్పందించిన నరేందర్ రెడ్డినిగ్రామస్తులుఅభినందించారు



# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బరిలో యాదగిరి శేఖర్ రావు

- గ్రాడ్యుయేట్ లందరూ ఓటు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి



**పెద్దపల్లి, అక్టోబర్ 09 (పిసిడబ్ల్యూ న్యూస్):** సుల్తానాబాద్ నుండి కాటారం వరకు ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లతో సమావేశాలు నిర్వహిస్తున్నట్రస్మా రాష్ట్ర సలహాదారుడు మాజీ అధ్యక్షుడు యాదగిరి శేఖర్ రావు కరీంనగర్, మెదక్, అదిలాబాద్, నిజామాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బరిలో ఉంటున్న అంటూ సుల్తానాబాద్, పెద్దపల్లి వివిధ పాఠశాల కరెస్పాండెంట్లతో సమావేశం నిర్వహించారు.ఆయన మాట్లాడారు నిరుద్యోగుల కోసం, ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారం కొరకు ముందు ఉంటానని, ఈసారి తప్పకుండా గ్రాడ్యుయేట్స్ వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న టీచర్స్ తనకు మద్దతు ఇవ్వాలని అలాగే గ్రాడ్యుయేట్స్ తమ ఓటు నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. కరోనాకాలంలో టీచర్స్ కు 25 కిలోల బియ్యం మరియు ఆర్థిక సహాయం, ఇప్పించడంలో తోపాటు ట్రస్మా బలోపేతం చేయడమే కాకుండా ప్రైవేట్ పాఠశాలల సమస్యలు తన సమస్యలుగా భావించి ప్రతి కరస్పాండెంట్ కు ధైర్యంగా ఇచ్చిన యాదగిరి శేఖర్ రావుకు తమ మద్దతు ఉంటుందని కరస్పాండెంట్లు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఓటు నమోదు పత్రాన్ని విడుదల చేశారు. నవంబర్ 6 ఓటు నమోదుకు చివరి తేదీ వివరించారు. ఒక్క రోజులోనే సుల్తానాబాద్, పెద్దపల్లి, గోదావరిఖని, మంథని, కాటారం, మహాదేవపూర్ వివిధ పాఠశాలల కరస్పాండెంట్లతో సమావేశమై తమ మద్దతును కోరారు. పెద్ద పెల్లి లో జరిగిన కార్యక్రమంలో గాయత్రి విద్యాసంస్థల అధినేత శ్రీనివాస్, ట్రస్మా జిల్లా అధ్యక్షులు అబ్బు కేశవరెడ్డి, బుచ్చిరెడ్డి, ఉమామహేశ్వర్, సయ్యద్ నసీర్ , వెంకటేశ్వర్లు , సతీష్ మరియు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎమ్మెల్యేను కలిసిన గౌడ సంఘం నూతన అధ్యక్షులు బుర్ర లక్ష్మణ్ గౌడ్



**చిట్యాల, అక్టోబర్ 10(పిసి డబ్ల్యూ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని మండల కేంద్రం గౌడ సంఘం నూతన అధ్యక్షులుగా బుర్ర లక్ష్మణ్ గౌడ్ ఎన్నికైన సందర్భంగా భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ని మర్యాదపూర్వకంగా కలసి బోకే ఇచ్చి శాలువాతో సన్మానించడం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చిట్యాల గౌడ సంఘం అధ్యక్షులు లక్ష్మణ్ కు అభినందనలు తెలియజేస్తూ సంఘాన్ని బలోపేతంలో నడిపించాలని నా సహాయ సహకారాలు మీకు ఉంటాయని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చిట్యాల కాంగ్రెస్ మండల అధ్యక్షులు గూట్ల తిరుపతి ,టేకుమట్ల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కోటగిరి సతీష్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి దొడ్డికిష్టయ్య యూత్ మండల అధ్యక్షులు అల్లకొండ కుమార్ ,బీసీసెల్ మండల అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి గడ్డం కొమురయ్య, టౌన్ యూత్ అధ్యక్షులు అల్లం రాజు ,మాజీ ఎంపీటీసీ సర్వ శరత్ ,గౌడ సంఘండైరెక్టర్ బుర్ర రాజకుమార్ పాల్గొన్నారు.

## చిట్యాలలో ఘనంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఖండ పద సంచలన్ (రూట్ మార్చ్)

**చిట్యాల, అక్టోబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆర్ఎస్ఎస్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల శాఖ ఆధ్వర్యంలో పద సంచలన్ మరియు విజయదశమి ఉత్సవము నిర్వహించడం జరిగింది. ఇందులో గనవేషధారనలో స్వయం సేవకులు 125 మంది పాల్గొని చిట్యాలలోని ప్రధాన వీధులలో దేశభక్తి గీతాలు పాడుకుంటూ..రూట్ మార్చ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది, తదనంతరం హైస్కూల్ గ్రౌండ్ లో విజయదశమి ఉత్సవాన్ని నిర్వహించడం జరిగింది, దీనిలో భాగంగా ఖడ్గ పూజ మరియు ఆర్ఎస్ఎస్ శస్త్ర అయినటువంటి దండను పూజించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ వరంగల్ విభాగ్ సంగ్ చాలక్ చిలుకమారి సంజీవ్ పాల్గొని మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ అనేది సరిగా 100 సంవత్సరాల క్రితం విజయదశమి పర్వదినం నాడు మహారాష్ట్రలోని నాగపూర్ లో డాక్టర్ కేశవరావు ప్రారంభించడం జరిగిందని, ప్రస్తుతం మన దేశంలో 65 వేల గ్రామాలలో సంఘ శాఖలు నడుస్తున్నాయని, ప్రపంచంలోని 60 దేశాలలో ఆర్ఎస్ఎస్ శాఖలు నడుస్తున్నాయన్నారు. ప్రతిరోజు ఒక గంట శాఖ ద్వారా ప్రజలలో దేశభక్తి హిందూ ధర్మం పట్ల మరియు సేవాభావమును పెంపొందించుటకు ఆర్ఎస్ఎస్ కృషి చేయుచున్నదని, సరిగ్గా విజయదశమి రోజున శ్రీరాముడు రావణున్ని వధించి..ధర్మాన్ని కాపాడి..ధర్మ పాలనకు కృషి చేశాడన్నారు. రాక్షసుల యొక్క బాధలను తట్టుకోలేక దేవతలందరూ చెల్లా చెదురైపోయినప్పుడు ఆదిపరాశక్తి తల్లి దుర్గామాత దేవతలందరి యొక్క శక్తిని తనలో ఇముడుచుకొని 10 చేతులతో 10 రకాల అస్త్రాలను ధరించి మహిషాసురుని వధించడం జరిగినదని, ఆ విధముగా చెడుపై మంచికి విజయానికి గుర్తుగా విజయదశమి పండుగను హిందువులందరూ దేశంలోని అన్ని గ్రామాలలో నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం ప్రారంభమై 100 సంవత్సరాలకు వస్తున్న సందర్భముగా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ప్రతి నాలుగు గ్రామాలకు ఒక శాఖను పెట్టి, హిందువులను ఐక్యమత్యం చేసి, భారత దేశంలో, ప్రపంచంలో మొదటి స్థానంలో నిలబెట్టాలని కోరడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవర్గ బుర్ర సదయ్య, ఖండ సంఘచాల కనుకుల లక్ష్మారెడ్డి, వరంగల్ విభాగ్ సేవ ప్రముఖ కనుకుల చంద్రారెడ్డి, కండ సహకార్యవాహ శ్రీరాం రఘుపతి, గడ్డం వెంకటేష్, ముప్పడోజు సాయికిరణ్, అల్లం మధుకర్, పుప్పాల సురేష్, కుడికాల శ్రీనివాస్, చిలుముల శ్రీనివాస్, చింతల సాయి వినయ్, ఆరెపల్లి శ్రీనివాస్, కనకం భద్రయ్య, బుర్ర వెంకన్న, గుండా మణికుమార్, వేల్పుల రాజు తదితరులు పాల్గొన్నారు.



## గుడుంబా స్థావరాలపై జిల్లా వ్యాప్తంగా పోలీసు, ఎక్సైజ్ అధికారుల సంయుక్త దాడులు





**చిట్యాల, అక్టోబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశాలతో జిల్లాలో గుడుంబా స్థావరాలపై పోలీసు, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా ఏక కాలంలో దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో 2320 లీటర్ల బెల్లం పానకం ధ్వంసంతో పాటు,124 లీటర్ల గుడుంబా పట్టుబడింది. గుడుంబా తయారికి ఉపయోగించే వివిధ పాత్రలను స్వాధీనం చేసుకొని, 13 కేసులు నమోదు చేసి 18 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశాలతో డిస్ట్రిక్ట్ ప్రోహిబిషన్ ఎక్సైజ్ అధికారి వేముల శ్రీనివాస్, భూపాలపల్లి, కాటారం డీఎస్పీలు సంపత్ రావు, రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. ఈ సందర్భంగా ఎక్సైజ్ – పోలీసు శాఖ అధికారులు మాట్లాడుతూఅక్రమంగా గుడుంబా తయారు చేసినా, అమ్మినా చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుడుంబా వల్ల అనేక నష్టాలున్నాయని, గుడు%శీ%బా వల్ల అనారోగ్యం సంభవించడంతో పాటు, ప్రాణాలు పోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజలు గుడుంబా స్థావరాల వివరాలు, తయారీదారుల సమాచారం పోలీసులకు, ఎక్సైజ్ అధికారులకు తెలియచేయాలని అన్నారు. ప్రభుత్వం గుడుంబా విషయంలో చాల సిరియస్ గా ఉందని, గుడుంబా నిర్మూలనకు ప్రజలు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిట్యాల, భూపాలపల్లి, కాటారం సిఐలు మల్లేష్, నరేష్ కుమార్, ఎక్సైజ్ అధికారులు, రమ్యా రెడ్డి, రాజ సమ్మయ్య కిష్టయ్య, షేక్ రబ్బానీ, పోలీసు , ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా బతుకమ్మ వేడుకలు



**మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్9(పిసిడబ్ల్యూ న్యూస్):** మంచిర్యాల పట్టణంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గీట్ల సుమీత్ ఆధ్వర్యంలో తెలంగాణ బంగారు బతుకమ్మ సంబరాలను పురస్కరించుకొని జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ బతుకమ్మ వేడుకలలో మహిళ జిల్లా నాయకురాలు,వారి కుటుంబ సభ్యులు అందరూ కలిసి ఎంతో ఉత్సాహంగా బతుకమ్మ పాటలతో సంబరాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ బతుకమ్మ సంబరాల సందర్భంగా జిల్లా అధ్యక్షులు గీట్ల సుమీత్ మాట్లాడుతూ తెలంగాణలో మహిళలకు బతుకమ్మ పండుగ అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్నదని, పూలనే దైవంగా భావించే బతుకమ్మ పండుగను నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం మహిళలు మరియు కుటుంబ సభ్యులు, పిల్లలు అందరూ కలిసి బతుకమ్మ పండుగ వేడుకలు జరుపుకోవాలనే ఉద్దేశంతో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బంగారు బతుకమ్మ వేడుకలు నిర్వహించడం జరిగినదని తెలిపారు. అదేవిధంగా బతుకమ్మ సంబరాలలో పాల్గొని విజయవంతం చేసిన తోటి ఉద్యోగులందరికి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలోజిల్లా ప్రధాన కార్యదర్శి గోవర్ధన్, అసోసియేట్ అధ్యక్షులు సాధిక్, కోశాధికారి శ్రీనివాస్,స్పోర్ట్స్, కల్చర్ సునీత ,స్పోర్ట్స్, కల్చర్ అఖిల్,మహిళా వింగ్ కార్యదర్శులు మరియు సభ్యులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## చెరువుల పరిరక్షణ మన అందరి బాధ్యత

- స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి





**హనుమకొండ ప్రతినిధి, అక్టోబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్):** చెరువును సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, తద్వారా ప్రకృతిని కాపాడిన వారమవుతామని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్, ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుధవారం ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ధర్మసాగర్ రిజర్వాయర్ లో మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పెద్దమ్మ తల్లికి, గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి చేప పిల్లలను విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో మత్స్య సంపద పెంచాలని తద్వారా మత్స్య కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి చేపట్టినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో జలాశయాలలో నీరు సమృద్ధిగా ఉండడం వల్ల చేప పిల్లల పెంపకానికి అనువైన వాతావరణం ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం చేపలను దిగుమతి స్థాయి నుండి ఇప్పుడు ఎగుమతి చేసే స్థాయికి ఎదగడం శు భ పరిణామం పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని జలాశయాలలో 45కోట్ల చేప పిల్లల పంపిణీకి ప్రణాళికలు సిద్ధం చేసిందని అందుకోసం 52కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. మత్స్య కార్మిక సంఘాలలో సభ్యులైన ప్రతీ ఒక్కరికి రూ. 5లక్షల ఉచిత ప్రమాద భీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. దేవాదుల ప్రాజెక్టులో మొట్టమొదటి రిజర్వాయర్ ధర్మసాగర్ రిజర్వాయర్ అని తెలిపారు. ధర్మసాగర్ రిజర్వాయర్ సాగు నీటితో పాటు త్రాగు నీటిని కూడా అందిస్తుందని వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఎవరిన్ని విమర్శలు చేసినా దేవాదుల ప్రాజెక్టును ప్రారంభించినట్లు తెలిపారు. 2ఏళ్లలో దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని ప్రతీ ఎకరాకు రెండు పంటలకు సాగు నీరు అందించే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. త్వరలోనే నక్కల తూము ద్వారా ధర్మసాగర్ రైతులకు సాగు నీరు అందిస్తామని అన్నారు. ప్రకృతి అందాలతో కూడిన ధర్మసాగర్ రిజర్వాయర్ మరియు దేవునూర్ గుట్టలను కలిపి ఎకో టూరిజం ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. రిజర్వాయర్ కు నాలుగు వైపులా ఉన్న కాల్వల ద్వారా చేపలు వెళ్ళిపోకుండా ఉండడానికి అవసరమైన ఫెన్సింగ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. చేపల మార్కెట్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని వెంటనే గుర్తించాలని స్థానిక ఎమ్మార్వో కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో, ఎంపిడివో, మత్స్య శాఖ అధికారులు, మత్స్య కార్మిక సంఘం అధ్యక్షులు సుధాకర్, డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, ముదిరాజ్ కులస్తులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ప్రారంభోత్సవం కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

**• ఏర్పాట్లను పరిశీలించిన జారే**



**అశ్వారావుపేట, అక్టోబర్ 9(పిసిడబ్ల్యూ న్యూస్):** పామాయిల్ సాగులో అధిక దిగుబడుల కోసం నిర్వహిస్తున్న అవగాహన సదస్సును రైతులందరూ వినియోగించుకోవాలని అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం సమీపంలో పామాయిల్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. ఈ నెల 12వ తేదీన 2.5 మెగావాట్ల నూతన విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ప్రారంభోత్సవం జరుగుతుందని తెలిపారు. పామాయిల్ పంట సాగు విధానాలపై అవగాహన సదస్సు నిర్వహించటం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర వ్యవసాయ కో ఆపరేటివ్ హ్యాండ్లూమ్ అండ్ టెక్స్టైల్స్ శాఖల మంత్రివర్యులుతుమ్మల నాగేశ్వరరావు పాల్గొంటారని తెలిపారు. అలాగే పామాయిల్ సాగు విస్తీర్ణం పెరుగుతున్నందున ప్రస్తుతం ఉన్న ఫ్యాక్టరీ తో పాటు మరొక ఫ్యాక్టరీ అదనంగా నిర్మిస్తున్నామని ఈ రెండు ఫ్యాక్టరీలకు అవసరమయ్యే విద్యుత్తును స్వతహాగా సమకూర్చుకునేందుకు 32 కోట్ల వ్యయంతో పామాయిల్ ఫ్యాక్టరీ వ్యర్థాలతో అవసరమయ్యే విద్యుత్ ఉత్పత్తి చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే నిపుణుల బృందంతో పామాయిల్ సాగులో అధిక దిగుబడులు సాధించడానికి తెగుళ్లను అరికట్టటానికి తీసుకోవలసిన మెలకువలు తదితర అంశాలను వివరించడానికి అవగాహన సదస్సు అదే రోజు నిర్వహిస్తున్నామని అధికారులు విలువైన సమాచారాన్ని రైతులకు అందిస్తారని తప్పకుండా ఈ కార్యక్రమాన్ని పామాయిల్ సాగు రైతులందరూ హాజరై వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తుమ్మ రాంబాబు, మొగళ్ళపు చెన్నకేశవరావు , సుంకవల్లి వీరభద్రరావు, జూపల్లి ప్రమోదు,, ఆలపాటి ప్రసాదు, చిన్నం చెట్టి సత్యనారాయణ,ఆయిల్ఫెడ్ అధికారులు, పామాయిల్ రైతు సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ అశ్వారావుపేట దమ్మపేట మండలాల నాయకులు, పలువురు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ విప్లవ యోధుడు చేగువేరా 57వ వర్ధంతి



**కాప్రా, అక్టోబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో ఈసీఐఎల్ కమలానగర్ పార్టీ ఆఫీసులో 9 10 2024 ఉదయం 11 గంటలకు అంతర్జాతీయ విప్లవ యోధుడు చే గువేరా 57వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఆఫీస్ కార్యదర్శి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎన్ శ్రీనివాస్ చే గువేరా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రముఖ రచయిత పి.బి చారి మాట్లాడుతూ చే గువేరా అంటేనే ఒక విప్లవ పదమని అన్నారు. క్యూబా విప్లవంలో ఫెడరల్ క్యాస్ట్రో తో కలిసి క్యూబా విప్లవాన్ని జయప్రదం చేసి అక్కడ మంత్రివర్గంలో పనిచేసి నప్పటికీ నిత్యం ప్రజలలో మమేకమై జీవించా రని చెప్పారు. చే గువేరా స్వయానా డాక్టర్ కావడమే కాకుండా విప్లవ రథ సారధిగా నిలిచారు. వారు క్యూబా విప్లవం జయప్రదం తర్వాత మొత్తం లాటిన్ అమెరికా దేశాలలో సామ్రాజ్యవాదుల పీడనల కు గురై ప్రజలు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్న తరుణంలో, ఆ దేశాలు కూడా విముక్తం సాధించేందుకు విప్లవ పంథాను ఎంచు కొని సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాటం చేశారు. చివరకు 1967 బొలివియాలో సామ్రాజ్యవాద మూకలు అతి దారుణంగా హత మార్చారు. మొత్తం ప్రపంచంలోనే యువకులకందరికీ నేడు ఐకాన్ గా మిగిలిపోయారు. చే గువేరా అంటేనే విప్లవం అనీ ప్రపంచమంతా కీర్తించింది. ప్రముఖ విద్యావేత్త పి జయ ప్రకాష్ మాట్లాడుతూ చే గువేరా అంటేనే విప్లవం అనే నానుడి సాధారణమైపోయింది. నేడు మన దేశ పరిస్థితి చూస్తే ఇంటికో చేగువేరా అవసరమని అనిపిస్తుంది. పేదరికం పెరుగుతూ ఉంది దోపిడి రూపం మారింది కానీ దోపిడి మారలేదు మన దేశానికి స్వతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు పూర్తి చేసుకున్న నేటికి కూడా మనము వేల సంవత్సరాల వెనకకు వెళ్తున్నాము. చివరకు సామ్రాజ్యవాదులు సైతం చే గువేరాను తమ వ్యాపారాలకు సైతం వినియోగించుకునేటువంటి దశకు చేర్చారని అయినా చే గువేరా అంటే విప్లయోధులకు మార్గదర్శి అని అన్నారు. అనంతరం చే గువేరా చిత్రపటానికి సభికులందరూ పూలను వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, పి బి చారి, జయప్రకాష్, కేకే ఉన్నికృష్ణన్, గౌసియా, శోభ తదితరులు పాల్గొన్నారు.

# దగా పడ్డ దళిత బంధు పథకాన్ని వెంటనే విడుదల చేసి లబ్ధిదారులను ఆర్థికంగా ఆడుకోండి...

**• దళిత రత్న అవార్డు గ్రహీత ప్రభు**






**హుజూరాబాద్, అక్టోబర్ 9 (పిసీడబ్ల్యూ న్యూస్):** హుజురాబాద్ నియోజకవర్గం లో దళితులకు రెండో విడత రాని లబ్ధిదారులకు వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగారి ప్రీతం ను హైదరాబాదులోని డి ఎస్ ఎస్ భవన్లోని తమ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి దగాపడ్డ దళిత బంధు రెండో విడత పథకాన్ని వెంటనే విడుదల చేయాలని కోరడం జరిగిందని దళిత రత్న అవార్డు గ్రహీత అంబాల ప్రభాకర్ ప్రభు అన్నారు. ఈ సందర్భంగా ప్రభు మాట్లాడుతూ...నాటి మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి దళిత బంధు పథకం ప్రవేశ పెట్టారని ఆ పథకం ద్వారా నియోజక వర్గంలో ఒక్కక్క కుటుంబానికి పది లక్షల రూపాయలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి మంజూరు చేయగా అట్టి పథకంలో మొదటి విడుతలో ఐదు లక్షలవిడుదల చేయగా, వివిధ వ్యాపారాలు పెట్టుకొని జీవిస్తున్న తరుణంలో షాపులకు అద్దె కట్టలేని పరిస్థితుల్లో అదనంగా అప్పులు చేస్తూన్నారని,రెండో విడత 5 లక్షల రూపాయలు విడుదల చేస్తే వారి జీవితాలు అభివృద్ధి చెందుతాయనే ఆశతో నెట్టుకుంటూ వస్తున్నారని తెలిపారు, మిగత రెండో విడత లబ్ధిదారులు సుమారు ఐదు వేల మందికి శాసనసభ ఎన్నికల కోడ్ నిలిపివేయడం జరిగిందని తెలిపారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి (10) నెలలు గడిచిన హుజురాబాద్ నియోజకవర్గం లోని దళితులకు రెండో విడత దళిత బంధు కోసం లబ్ధి దారులు వివిధ ప్రజా సంఘాలు , దళిత నాయకులు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండో విడత కోసం న్యాయ పోరాటం చేస్తున్నటువంటి నాయకులను అక్రమ అరెస్టులు చేస్తూ పోలీసులు భయభ్రాంతులకు గురి చేస్తూ అణిచివేస్తున్నారని తెలియజేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి హుజురాబాద్ నియోజకవర్గం లో పైలెట్ ప్రాజెక్టుగా ప్రవేశపెట్టిన దళిత బంధు రెండో విడత పథకాన్ని వెంటనే విడుదల చేసి లబ్ధిదారులను ఆర్థికంగా ఆదుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం కు విజ్ఞప్తి చేశారు.

# పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షులుగా మానువాడ శంకర్ నియామకం



**కరీంనగర్ జిల్లా, అక్టోబర్ 09(పిసిడబ్ల్యూ న్యూస్):** పిఆర్‌టియు టి ఎస్ రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షులుగా మానువాడ శంకర్ నియామకం. ఈ నెల 7,8వ తేదిలలో రెండు రోజులు హైదరాబాదులో నిర్వహించిన 35వ పిఆర్టిటిఎస్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో పి. ఆర్.టి. యు.టి.ఎస్ నూతన కార్యవర్గం ఎన్నికల్లో భాగంగా జడ్.పి.హెచ్.ఎస్ అనుపురం పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ సోషల్ గా విధులు నిర్వర్తిస్తున్న మానవాడ శంకర్ పిఆర్ టి యు.టి.ఎస్ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులుగా 2024–25, 2025–26 రెండు సంవత్సరాలకు నియామకం చేయడం జరిగింది. ఈ నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు పింగిలి శ్రీపాల్ రెడ్డి,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్ రెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు,ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిషన్. వేములవాడ అర్బన్, పట్టణ మండల శాఖ అధ్యక్షులు లావు కిరణ్, ప్రధాన కార్యదర్శి రాం ప్రభువు, రమేష్, మహేష్ కు కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది, ఇతని ఎన్నిక పట్ల మండల,జిల్లా పిఆర్టి సభ్యులు హర్షం వ్యక్తం చేశారు, ZPHS, అనుపురం, ప్రధానోపాధ్యాయులు జి. విట్టల్, కవిత, బి.రమేష్, దేవేందర్, కమిని రవీందర్, రమేష్, రజిత, నిఖిత, తదితరులు పాల్గొన్ని, శుభాకాంక్షలు తెలియజేస్తూ, అభినందనలు తెలియజేసినారు.

# విద్యా రంగంలో ఆశాస్త్రీయ మార్పులు సరికాదు

**• డిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తె.వి.ప.వి.రాష్ట్ర బాధ్యులు లింగారెడ్డి**




**కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 08(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్,ప్రెస్ భవన్లో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ (టిసెక్) కరీంనగర్ ఆధ్వర్యంలో తెలంగాణ విద్యారంగం – సమస్యలు– సవాళ్లు – కర్తవ్యాలు,,అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగినది .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ విద్యాపరిరక్షణ కమిటీ (టీసెక్)రాష్ట్ర బాధ్యులు,డిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి లింగారెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ విద్యారంగంలో భాగస్వామ్యులైన ఉపాధ్యాయులు ,అధ్యాపకులు ,మేధావులు ,వివిధ సంఘాల నుండిఅభిప్రాయాలు తెలుసుకోకుండానే ఇటీవల ప్రభుత్వం మూడవ తరగతి వరకు అంగన్వాడీ కేంద్రాల్లో విలీనం చేసి విద్యాబోధన సాగించాలని ప్రభుత్వ ప్రణాళికను వెల్లడించింది .అదే విధంగా మన రాష్ట్రంలో దశాబ్ధాలుగా కొనసాగుతున్న ఇంటర్మీడియట్ విధానాన్ని రద్దుచేసి 10ం2 పాఠశాలలో కొనసాగించే విధంగా నూతన జాతీయ విద్యావిధానాన్ని మన రాష్ట్రంలో 5ం3ం3ం4 విధానంలో అమలు చేయాలని ,మండలానికో ఇంటిగ్రేటెడ్ పాఠశాల, నియోజకవర్గానికి ఒక ఇంటర్నేషనల్ పాఠశాల అదేవిధంగా రాష్ట్రంలోని 17 విశ్వవిద్యాలయాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయకుండా ఖాళీలను నింపకుండా నిధులు కేటాయించకుండా కొత్త కోర్సులు ప్రారంభించకుండా కేవలం ఒకే ఒక స్కిల్ యూనివర్సిటీ స్థాపించి యువ విద్యార్థులను నైపుణ్యావంతులుగా తయారు చేయుటకు ప్రభుత్వం తన చర్యలు ప్రారంభించిందని కానీ విద్యా రంగంలో అశాస్త్రీయ మైన మార్పులు చేపట్టడాన్ని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని , కావున ప్రభుత్వం ఇప్పటికైనా ఉపాధ్యాయులు అధ్యాపకులు మేధావులతో చర్చించిన తర్వాతనే విద్యారంగ మార్పులకు శ్రీకారం చుట్టాలని డిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర బాధ్యులు టీ లింగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ద్వితీయ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు యం.రఘుశంకర్ రెడ్డి మాట్లాడుతూ పూర్తిస్థాయి మండల విద్యాధికారులను నియమించకుండా కేవలం ప్రధానోపాధ్యాయులకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతతో కొనసాగించడం వాంఛనీయం కాదని అదేవిధంగా కొత్తగా ఏర్పడిన జిల్లాలకు జిల్లా విద్యాధికారుల పోస్టులను,నియోజకవర్గానికి ఒక డిప్యూటీ డిఇఓ పోస్టును మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.టి పి టి ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం ద్వారా కేంద్ర ప్రభుత్వం మతవాద భావనలను, కులాల అంతరాలను పెంచే విధంగా పాఠ్యప్రణాళికలో చేర్చుతున్నారని అందువల్లనే నూతన జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకిస్తున్నామని. కావున నూతన జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్రంలో కూడా అమలు చేయవద్దని, ఉపాధ్యాయుల సర్దుబాటు పేర అశాస్త్రమైన జీవో 25 ను దొడ్డి దారిన అమలు చేయవద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.టిపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.ఎల్లయ్య మాట్లాడుతూ విద్యారంగానికి కేంద్రం తన బడ్జెట్లో 10 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం నిధులను కేటాయించాలని కోరారు.ఈ సమావేశానికి డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆవాల నరహరి అధ్యక్షత వహించగా టి పి టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు సహ–అధ్యక్షులుగా వ్యవహరించగా డిటిఎఫ్ ,టిపిటిఎఫ్ సంఘాల రాష్ట్ర /జిల్లా/మండలాల బాధ్యులు ,కె.నారాయణ రెడ్డి, కే చంద్రమౌళి, కోల్ రాజ మల్లు, కె కిషన్ రావు , తూముల తిరుపతి, ఆర్ చంద్రశేఖర్ ,ఏ.సంతోష్ రెడ్డి,ఎ. ఏ దామోదర్, చకినాల రామ్మోహన్, ఏ. రాజేశ్వరరావు, చకినాల దేవేందర్, వి.పెంటయ్య వివిధ సంఘాల బాధ్యులు జి రవీందర్ రెడ్డి టీజీపీఏ అధ్యక్షులు, డాక్టర్ వంగల శ్రీనివాస్ లెక్చరర్ డిగ్రీ కళాశాల, కే సంజీవ్ ట్రైటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాజకీయ పార్టీల ప్రతినిధులు సిపిఐ నుండి ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి టీ సమ్మయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం వాసుదేవ రెడ్డి, భాహుజన సమాజ్ పార్టీ జిల్లా ప్రతినిధి సుతారి లక్ష్మణ్ వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు పాల్గొని మాట్లాడుతూ నాణ్యమైన విద్య ప్రజల హక్కు అని కావున ఉపాధ్యాయులు ప్రభుత్వ విద్యా విధానం గురించి ప్రజలకు తెలియపరచి చైతన్యవంతులు చేసి ప్రజా ఉద్యమాల ద్వార ప్రభుత్వాలపై ఒత్తిడి చేసి విద్యారంగాన్ని మార్చుకోవాలని సూచించారు.

# తెలంగాణలో మూడురోజులు ఉరుములతో కూడిన వానలు.. హెచ్చరించిన ఐఎండీ



**హైదరాబాద్,అక్టోబర్ 09(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో రాగల మూడురోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని.. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడే అవకాశాలున్నాయని వాతావరణశాఖ హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, కొత్తగూడెం, ఖమ్మం, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వానలుపడుతాయని చెప్పింది.గురువారం ఉమ్మడి ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, సిద్దిపేట, నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వానలు కురిసేందుకు అవకాశాలున్నాయని వాతావరణశాఖ హెచ్చరించింది. అలాగే, శుక్రవారం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలో వర్షాలు కురిసేందుకు అవకాశాలున్నాయని హెచ్చరించింది.

# త్వరలోనే అందరికి రుణమాఫీ చేస్తాం : మంత్రి కోమటిరెడ్డి



**హైదరాబాద్,అక్టోబర్ 09(పిసిడబ్ల్యూ న్యూస్):** రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం అమ్మిన డబ్బులు మూడు రోజుల్లోనే వారి బ్యాంకు అకౌంట్లో జమ చేస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం అయన నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఆర్జాల బావి వద్ద ఏర్పాటు చేసిన రాష్ట్రం లోనే మొదటి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..నల్గొండ జిల్లాలో గత సీజన్లో సైతం ధాన్యం కొన్న మూడు రోజుల్లోనే రైతులకు చెల్లింపులు చేశారని గుర్తు చేశారు. వానకాలం ధాన్యానికి సంబంధించి రైతులకు ఏవైనా ఇబ్బందులు ఏర్పడిన లేదా చెల్లింపులు ఆలస్యమైన జిల్లా పౌర సరఫరాల అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంకు ఫోన్ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న ధాన్యాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ప్రత్యే కించి సన్న ధాన్యానికి 500 రూపాయల బోనస్ సైతం ఇస్తున్నదని పేర్కొన్నారు.గ్రేడ్ –ఏ ధాన్యానికి క్వింటాలుకు 2320 రూపాయల మద్దతు ధర, సాధారణ రకానికి 2320 రూపాయలు ప్రభుత్వం మద్దతు ధరలను ప్రకటించిందన్నారు. మిల్లర్లు సన్న బియ్యంతో పాటు, దొడ్డు రకానికి సైతం ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా దొడ్డు ధాన్యాన్ని తీసుకోవాలని సూచించారు. రెండు లక్షల కన్నా ఎక్కువ ఉన్న వారి రుణాలను వారం పది రోజుల్లో రుణమాఫీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

# ఆబిడ్డలకు ఇస్తామన్న తులం బంగారం హామీని నెరవేర్చాలి : ఎమ్మెల్యే వేముల



**నిజామాబాద్,అక్టోబర్ 09(పిసిడబ్ల్యూ న్యూస్):** పేదింటి అడబిడ్డ పెళ్లికి ఆసరాగా ఉండటానికి ఒక మేనమామ కట్నంగా కేసీఆర్ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని ప్రారంభించారని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. వేల్పూర్, బాల్కొండ మండలాల లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్ లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. అప్పటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మేము అధికారంలోకి రాగానే లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తాం అని మాట ఇచ్చారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. వారు అధికారంలోకి వచ్చి 10 నెలలు అయిన ఇచ్చిన తులం బంగారం మాట నెరవేర్చలేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిననాటి నుంచి ఇప్పటి వరకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందుకున్న వారందరికి లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇవ్వాలని, అడబిడ్డల పక్షాన రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ దసరా పండుగకు పేదింటి అడబిడ్డలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ ప్రభుత్వం చీరల పంపిణీ చేయలేదన్నారు. మూసి ప్రక్షాళన పేరుతో పేద ప్రజల ఇండ్లు కూల్చుతున్నారు. దీనివల్ల ఒక్క ఏకరానికైనా లాభం జరుగుతుందా? అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ప్రజలు కాంగ్రెస్‌ను మూసీలో ముంచుతారన్నారు.

# నిర్మల్ జిల్లాలో విషాదం...

**- చెట్టును ఢీ కొన్న కారు, తండ్రి, కొడుకు మృతి**

**నిర్మల్,అక్టోబర్ 09(పిసిడబ్ల్యూ న్యూస్):** నిర్మల్ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. కారు అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టిన ఘటనలో తండ్రి,కుమారుడు మృతిచెందారు. ఈ విషాదకర సంఘటన నర్సాపూర్(బి) మండలం చాక్పెల్లి గ్రామం వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సరేష్(27) అనే వ్యక్తి తన కుటుంబంతో కలిసి బోథ్ మండలం కుచ్లాపూర్ నుంచి లోకేశ్వరం మండలం మన్మద్ వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది.ఈ ప్రమాదంలో సరేష్, అతడి కుమారుడు దీక్షిత్(7) అక్కడికక్కడే మృతి చెందాడు. సురేష్ భార్య, కుమార్తెకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# ఛాంపియన్స్ ట్రోఫీ 2025
# ఫైనల్ వేదిక మార్పు



ఛాంపియన్స్ ట్రోఫీ 2025 సన్నాహాల్లో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు బిజీగా ఉంది. ఈ ఐసీసీ టోర్నీ వచ్చే ఏడాది ప్రారంభంలో జరగనుంది. అయితే, టీమ్ ఇండియా భాగస్వామ్యానికి సంబంధించి ఇప్పటికీ పరిస్థితి స్పష్టంగా లేదు. 2008 నుంచి భారత జట్టు పాకిస్థాన్‌లో పర్యటించలేదు. ఇలాంటి పరిస్థితుల్లో 2025 ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారత క్రికెట్ జట్టు పాకిస్థాన్ వెళ్లే అవకాశాలు చాలా తక్కువ. ఇదిలా ఉంటే, ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు సంబంధించి ఒక పెద్ద అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ టోర్నీ చివరి మ్యాచ్ పాకిస్థాన్ వెలుపల నిర్వహించే అవకాశం ఉంది. భారత్ వర్సెస్ పాకిస్తాన్ మధ్య సంబంధాలు చాలా కాలంగా బాగా లేవు. దీని కారణంగా భారత జట్టు ఈ దేశంలో పర్యటించలేదు. ఈ కారణంగా, రెండు జట్ల మధ్య ఎటువంటి సిరీస్‌లు జరగడం లేదు. ఐసీసీ టోర్నమెంట్లు, ఆసియా కప్ సమయంలో మాత్రమే భారత్ వర్సెస్ పాకిస్తాన్ మధ్య మ్యాచ్‌లు జరుగుతాయి. టెలిగ్రాఫ్ నివేదిక ప్రకారం, ఈ టోర్నమెంట్‌ను హైబ్రిడ్ మోడల్‌లో ఆడవచ్చు. ఈ టోర్నీ చివరి మ్యాచ్ లాహోర్‌లో జరగనుంది. అయితే, టీమ్ ఇండియా ఫైనల్ చేరితే ఫైనల్ మ్యాచ్ కూడా పాకిస్థాన్ బయటే జరగడంతో ఈ మ్యాచ్ దుబాయ్‌లోనే జరిగే అవకాశం ఉంది. ఇటువంటి పరిస్థితిలో, టీమ్ ఇండియా తన గ్రూప్ దశ మ్యాచ్‌లన్నింటినీ పాకిస్తాన్ వెలుపల ఆడుతుంది. సెమీ–ఫైనల్‌కు చేరుకున్న తర్వాత కూడా వేదికలో మార్పులు చేయవచ్చని నమ్ముతారు. ప్రస్తుతం రెండు సెమీఫైనల్‌లు పాకిస్థాన్‌లో మాత్రమే జరగాల్సి ఉంది. 2023 ఆసియా కప్‌కు ఆతిథ్యం కూడా పాకిస్థాన్‌కే దక్కింది. అయితే అప్పటికి కూడా భారత జట్టు పాకిస్థాన్‌లో పర్యటించలేదు. టోర్నమెంట్‌ను హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించారు. టీమిండియా తన అన్ని మ్యాచ్‌లను శ్రీలంకలో ఆడింది. ఫైనల్ కూడా ఇక్కడ జరిగింది. అంటే అదే ఫార్ములా మరోసారి ప్రయత్నించవచ్చు. దాదాపు 8 ఏళ్ల నిరీక్షణ తర్వాత మళ్లీ ఛాంపియన్స్ ట్రోఫీ రాబోతోంది. అదే సమయంలో, ఈ టోర్నమెంట్ గత 29 ఏళ్లలో పాకిస్తాన్ గడ్డపై జరిగిన మొదటి %×జజ% ఈవెంట్ కూడా. ముసాయిదా షెడ్యూల్ ప్రకారం, టీమ్ ఇండియా తన అన్ని మ్యాచ్‌లను లాహోర్‌లో ఆడాలి. ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్‌తో టీమిండియా తన తొలి మ్యాచ్ ఆడనుంది. దీని తర్వాత ఫిబ్రవరి 23న న్యూజిలాండ్‌తో రెండో మ్యాచ్ ఆడనుంది. అదే సమయంలో, టోర్నమెంట్ హోస్ట్, దాని చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో మార్చి 1న భారత్ గ్రూప్ దశలో మూడో, చివరి మ్యాచ్ ఆడనుంది. అయితే టీమ్ ఇండియా పాకిస్థాన్‌లో పర్యటించకపోతే ఈ మ్యాచ్‌లన్నింటి వేదికల్లో మార్పులు కనిపించవచ్చు.

# రూట్ ఏకంగా 18 సెంచరీలు బాదాడు..!




ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ టెస్ట్ క్రికెట్‌లో తన డ్రీమ్ రన్‌ను కొనసాగిస్తున్నాడు. రూట్ గత మూడేళ్ల కాలంలో 16 హాఫ్ సెంచరీలు, 18 సెంచరీల సాయంతో 4600 పైచిలుకు పరుగులు చేశాడు. 2021 నుంచి టెస్ట్‌ల్లో ఇన్ని సెంచరీలు కాని, ఇన్ని పరుగులు కాని ఏ ఆటగాడూ చేయలేదు. ప్రస్తుత తరంలో అత్యుత్తమ ఆటగాళ్లుగా చెప్పుకునే కోహ్లి, విలియమ్సన్, స్టీవ్ స్మిత్ సైతం? రూట్ చేసినన్ని సెంచరీలు కాని, పరుగులు కాని చేయలేకపోయారు. రూట్ తాజాగా పాక్‌పై సెంచరీ చేసి తన సెంచరీల సంఖ్యను 35కు పెంచుకున్నాడు. ఈ సెంచరీ అనంతరం సోషల్‌మీడియాలో ఓ ఆసక్తికర గణాంకం చక్కర్లు కొడుతుంది. 2021 ఆరంభంలో రూట్ కేవలం 17 సెంచరీలు మాత్రమే చేస్తే.. అప్పుడు కోహ్లి సెంచరీల సంఖ్య 27గా ఉండింది. అదే ఇప్పుడు (2024లో) టెస్ట్‌ల్లో కోహ్లి సెంచరీల సంఖ్య 29గా ఉంటే.. రూట్ సెంచరీల సంఖ్య ఏకంగా 35కు చేరుకుంది. ఈ ఫిగర్స్‌ను సగటు టీమిండియా అభిమాని జీర్ణించుకోలేనప్పటికీ ఇది నిజం. ఈ గణాంకాలను బట్టి చూస్తే రూట్ ఏ రేంజ్‌లో సెంచరీల మోత మోగిస్తున్నాడో ఇట్టే అర్ధమవుతుంది. రూట్ ఈ మధ్యకాలంలో కోహ్లి ఒక్కడికే కాదు ఫాబ్‌లో మిగతా ఇద్దరికి (విలియమ్సన్, స్టీవ్ స్మిత్) కూడా కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాడు. 2021లో స్టీవ్ సెంచరీల సంఖ్య 26గా ఉంటే ప్రస్తుతం అతని సెంచరీల సంఖ్య 32గా ఉంది. 2021లో విలియమ్సన్ సెంచరీల సంఖ్య 24గా ఉంటే ఇప్పుడు అతని సెంచరీల సంఖ్య 32గా ఉంది. కోహ్లితో పోలిస్తే సెంచరీల విషయంలో విలియమ్సన్, స్టీవ్ స్మిత్ కాస్త మెగ్గానే కనిపిస్తున్నా, రూట్ ఈ ఇద్దరికి కూడా అందనంత ఎత్తుకు ఎదుగుతున్నాడు.

# అభిమాని కోసం కారు ఆపిన రోహిత్



టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ మరోసారి తన మంచి మనసు చాటుకున్నాడు. ముంబైలోని ఓ సిగ్నల్ వద్ద అభిమానికి సెల్ఫీ ఇచ్చాడు. అంతేకాదు షేక్ హ్యాండ్ ఇచ్చి.. పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశాడు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరలవుతోంది. 'హిట్‌మ్యాన్ గ్రేట్', 'రోహిత్ సూపర్' అంటూ ఫాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఇటీవల బంగ్లాదేశ్ టెస్టు సిరీస్‌లో ఆడిన రోహిత్ శర్మ.. న్యూజిలాండ్‌తో మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు సిద్ధమవుతున్నాడు. ఆక్టోబర్ 16 నుంచి బెంగళూరులో జరగనున్న తొలి టెస్టు కోసం రోహిత్ ప్రాక్టీస్ చేస్తున్నాడు. ప్రాక్టీస్ చేసేందుకు రోహిత్ తన లంబోర్ఘిని కారులో ముంబైలోని జియో పార్క్ స్టేడియంకు వెళ్తుండగా ఓ సిగ్నల్ వద్ద ఆగాడు. ఆ సమయంలో హిట్‌మ్యాన్‌ను చూసిన ఓ లేడి ఫ్యాన్.. కారు వద్దకు పరిగెత్తుకుంటూ వెళ్ళింది. సెల్ఫీ అడగ్గానే రోహిత్ ఫోటోకు ఫోజు ఇచ్చాడు. ఈ రోజు తన బర్త్‌డే అని ఆమె చెప్పగా.. షేక్ హ్యాండ్ ఇచ్చి విషెష్ తెలియజేశాడు. దాంతో ఆ అమ్మాయి సంతోషపడిపోయింది.

# ఐసీసీ నుంచి ఊహించని గిఫ్ట్ పట్టేసిన హార్దిక్ పాండ్యా




ఐసీసీ కొత్త ర్యాంకింగ్స్ జాబితాను విడుదల చేసింది. తాజా ర్యాంకింగ్స్‌లో టీమిండియా ఆటగాళ్లు ఊహించని సర్‌ప్రైజ్ పొందారు. బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన చేసిన హార్దిక్ పాండ్యా ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో దూసుకొచ్చాడు. ఐసీసీ కొత్త ర్యాంకింగ్స్ జాబితాను విడుదల చేసింది. తాజా ర్యాంకింగ్స్‌లో టీమిండియా ఆటగాళ్లు ఊహించని సర్‌ప్రైజ్ పొందారు. బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన చేసిన హార్దిక్ పాండ్యా ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో దూసుకొచ్చాడు. బంగ్లాతో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో 39 పరుగులతో విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడిన హార్దిక్.. బౌలింగ్‌లోనూ 1 వికెట్ తీయగలిగాడు. తన ఆటతో జట్టుకు విజయాన్ని అందించిన పాండ్యా.. ప్రస్తుతం టీ20 ఆల్ రౌండర్ ర్యాంకింగ్స్ జాబితాలో 4 స్థానాలు ఎగబాకి 3వ ర్యాంక్‌ను కైవసం చేసుకున్నాడు. బంగ్లాదేశ్‌తో జరిగే మిగిలిన రెండు మ్యాచ్‌ల్లోనూ హార్దిక్ తన ప్రదర్శనను కొనసాగిస్తే నంబర్ 1గా నిలిచే అవకాశం ఉంది. హార్దిక్ 216 రేటింగ్ పాయింట్లతో మూడో స్థానంలో ఉండగా, ఇంగ్లండ్‌కు చెందిన లియామ్ లివింగ్‌స్టన్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఆయనతో పాటు నేపాల్‌కు చెందిన దీపేంద్ర సింగ్ ఐరీ రెండో స్థానంలో ఉన్నారు. దానికితోడు బంగ్లాదేశ్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో రవీంద్ర జడేజా అద్భుత ప్రదర్శన కనబరిచాడు. దానిని సద్వినియోగం చేసుకున్న జడేజా టెస్టు ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్‌గా కొనసాగుతున్నాడు. 468 రేటింగ్ పాయింట్లతో జడేజా మొదటి స్థానంలో ఉండగా, 358 రేటింగ్ పాయింట్లతో ఆర్ అశ్విన్ రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. అలాగే, బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో అద్భుతమైన బౌలింగ్ ప్రదర్శన చేసిన ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా, ఐసీసీ టెస్ట్ బౌలర్ ర్యాంకింగ్స్‌లో కూడా చాలా ప్రయోజనం పొందాడు, ప్రస్తుతం, బుమ్రా 870 రేటింగ్ పాయింట్లతో టెస్ట్ బౌలర్ ర్యాంకింగ్స్‌లో మొదటి స్థానంలో ఉన్నాడు. అతనితో పాటు బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో అద్భుత బ్యాటింగ్ ప్రదర్శన కనబరిచిన యశస్వి జైస్వాల్ ఐసీసీ టెస్టు బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో 2 స్థానాలు ఎగబాకాడు. ప్రస్తుతం జైస్వాల్ 792 రేటింగ్ పాయింట్లతో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు.

# అభిషేక్ పోరెల్‌ను రిటైన్ చేసుకోనున్న ఢిల్లీ

ఐపీఎల్ 2025 మెగా వేలానికి సంబంధించి రిటెన్షన్ రూల్స్‌ను ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ప్రకటించిన విషయం తెలిసిందే. మొత్తంగా ఆరుగురు ఆటగాళ్లను రిటైన్ చేసుకునేందుకు ఫ్రాంచైజీలకు అవకాశం ఇచ్చింది. ఇందులో రైట్ టు మ్యాచ్ (ఆర్‌టీఎం) ఆప్షన్ కూడా ఉంది. అక్టోబర్ 31లోపు రిటెన్షన్ జాబితాను అన్ని ఫ్రాంచైజీలు సమర్పించాల్సి ఉంటుంది. ఇక నవంబర్‌లో మెగా వేలం జరిగే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) తమ రిటెన్షన్ లిస్ట్‌ను ఖరారు చేసినట్లు తెలుస్తోంది. నలుగురు ఆటగాళ్లను రిటైన్ చేసుకుని.. ఇద్దరు విదేశీ ప్లేయర్లను ఆర్‌టీఎమ్ కార్డ్ ద్వారా తిరిగి దక్కించుకోవాలని ఢిల్లీ క్యాపిటల్స్ చూస్తోందని సమాచారం. టీమిండియా వికెట్ కీపర్ రిషబ్ పంత్ రిటెన్షన్ లిస్ట్‌లో ప్రథమ ఎంపికగా ఉన్నాడు. పంత్ ఢిల్లీ కెప్టెన్ అన్న విషయం తెలిసిందే. స్టార్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ రెండో ఎంపికగా, స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ మూడో ఎంపికగా ఉన్నారు. ఇక అన్‌క్యాప్డ్ ప్లేయర్‌గా భారత యువ వికెట్ కీపర్ అభిషేక్ పోరెల్‌ను రిటైన్ చేసుకోవాలని ఢిల్లీ భావిస్తోందట. వికెట్ కీపింగ్ సహా హిట్టింగ్ చేయడం అతడికి కలిసొచ్చే అంశం. విదేశీ ప్లేయర్లు జేక్ ఫ్రేజర్ మెక్‌గర్క్, ట్రిస్టన్ స్టబ్స్‌ను ఆర్‌టీఎమ్‌తో దక్కించుకోవాలని డీసీ చూస్తోందని తెలుస్తోంది. ఐపీఎల్ 2025 నిబంధనల ప్రకారం.. రిటైన్ చేసుకునే మొదటి ఆటగాడికి ఫ్రాంచైజీ రూ.18 కోట్లు ఇవ్వాలి. రెండో ఆటగాడికి రూ.14 కోట్లు, మూడో ఆటగాడికి రూ.11 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. నాలుగు, అయిదవ ఆటగాడికి వరుసగా రూ.18 కోట్లు, రూ.14 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. అన్‌క్యాప్డ్ ఆటగాడికి 4 కోట్లు ఇవ్వాలి. అభిషేక్ పోరెల్‌కు 4 కోట్లు దక్కనున్నాయి. అంటే అతడికి జాక్‌పాట్ తగలనుంది. గత సీజన్‌లో అభిషేక్ 327 పరుగులు చేశాడు.



# హార్దిక్ విషయంలో అత్యుత్సాహం వద్దు: ఆర్పీ సింగ్




గ్వాలియర్‌లో బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టీ20లో భారత్ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. టీమిండియా విజయంలో స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కీలక పాత్ర పోషించాడు. బ్యాటింగ్‌లో 16 బంతుల్లో 39 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. పేస్ బౌలింగ్‌లో నో బ్యాక్ లుక్ షాట్‌తో హార్దిక్ తన సత్తా ఏంటో మరోసారి నిరూపించాడు. ఇక బౌలింగ్‌లో నాలుగు ఓవర్ల కోటాలో ఒక వికెట్ తీసి 26 రన్స్ ఇచ్చాడు. అయితే ఈ మ్యాచ్ ప్రదర్శన ఆదారంగా హార్దిక్ ఫామ్‌ను అంచనా వేయవద్దని భారత మాజీ ఫాస్ట్ బౌలర్ ఆర్పీ సింగ్ అంటున్నాడు. జియో సినిమాలో ఆర్పీ సింగ్ మాట్లాడుతూ%ొ% 'బంగ్లాదేశ్ లాంటి చిన్న జట్టుతో ఆడినప్పుడు ఆటగాడి ప్రదర్శనను జడ్జ్ చేయడం సరైంది కాదని నా అభిప్రాయం. బంగ్లా ఎలా ఆడుతుందో అందరం చూస్తున్నాం. అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించడం లేదు. ఇక్కడ హార్దిక్ పాండ్యాను తక్కువ చేయడం లేదు. అతడు అత్యుత్తమ ప్లేయర్. గతంలో ఇలాంటి ఇన్నింగ్స్‌లు ఎన్నో ఆడాడు, ఆడగలడు కూడా. అయితే బంగ్లాపై విభిన్నమైన షాట్లను ఆడడంలో ఏమాత్రం ఆశ్చర్యం లేదు. అసలైన పరీక్ష పటిష్ట జట్టు ఎదురైనప్పుడే ఉంటుంది. ఈజీగా మ్యాచ్ గెలుస్తున్నామని తెలిసినప్పుడు ఓ బ్యాటర్ మరింత స్వేచ్ఛగా షాట్స్ ఆడుతాడు. ఒత్తిడి ఉన్నప్పుడే అసలు ఆట ఏంటో తెలుస్తుంది. బంగ్లా ఏ దశలోనూ టీమిండియాకు సవాల్ విసరలేదు' అని అన్నాడు. 'హార్దిక్ పాండ్యా కొట్టిన ఫోర్, సిక్స్ ఇక్కడ విషయం కాదు. హార్దిక్ నాలుగు ఓవర్లు బాగా బౌలింగ్ చేశాడు. బ్యాటింగ్‌లో మంచి ఇన్నింగ్స్ ఆడాడు. గతంలో హార్దిక్ తన పూర్తికోటా ఓవర్లను వేయలేకపోయాడు. ఇప్పుడు అలవోకగా వేస్తున్నాడు. ఇది మనకు గుడ్‌న్యూస్. హార్దిక్ తన ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాడు. కానీ రాబోయే సిరీసుల్లోనూ రాణిస్తేనే.. అతడిపై ఓ అంచనాకు వస్తే బాగుంటుంది. హార్దిక్ విషయంలో అత్యుత్సాహం వద్దు' అని ఆర్పీ సింగ్ వివరించాడు.

# యానిమల్‌తో ప్రశంసలు .. విమర్శలూ ఎదుర్కొన్నా..

**- నటి తృప్తి డిమ్రి వెల్లడి**




యానిమల్' మూవీతో ఒక్కసారిగా ఫేమ్ సొంతం చేసుకున్ననటి త్రిప్తి డిమ్రి ఆ సినిమా తర్వాత ఆమెకు బాలీవుడ్‌లో వరుస అవకాశాలు దక్కాయి. తన తదుపరి చిత్రం 'విక్కీ విద్య కా వో వాలా వీడియో' ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. 'యానిమల్' తర్వాత తాను ఎదుర్కొన్న సవాళ్ల గురించి మాట్లాడారు. ఆ సినిమా వల్ల ఫేమ్ మాత్రమే కాదు విపరీతమైన విమర్శలు చూశానని అన్నారు. యానిమల్' విడుదలయ్యాక ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నా. జోయాగా యాక్ట్ చేసినందుకు నన్ను చాలామంది తిట్టారు. సోషల్‌మీడియా వేదికగా పలువురు నెటిజన్లు అసభ్యంగా ట్రోల్ చేశారు. వాటిని ఎలా తట్టుకోవాలో అర్థం కాలేదు. అలాంటి విమర్శలు ఎదుర్కొంటానని ఎప్పుడూ అనుకోలేదు. ఎంతో బాధపడ్డా. మానసికంగా ఆవేదనకు గురయ్యా. దానినుంచి బయటకు రావడం కోసం మూడు రోజుల పాటు ఏడుస్తూనే ఉన్నా. దానివల్ల బాధ కాస్త తగ్గింది. మనసు శాంతించింది. ఆ సమయంలో నా సోదరి ఎంతో సపోర్ట్‌గా నిలిచింది. నువ్వు ఏం చేశావో నీకు తెలుసు. కాబట్టి ఇతరుల మాటలు పట్టించుకోకు అని ధైర్యం చెప్పిందని తెలిపారు. రణ్‌బీర్ కపూర్, రష్మిక జంటగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వం వహించిన చిత్రం 'యానిమల్'. యాక్షన్ డ్రామా ఫిల్మ్‌గా ఇది తెరకెక్కింది. జోయాగా అలరించారు త్రిప్తి డిమ్రి. కథలో భాగంగా ఆమెపై కొన్ని ఇంటిమేట్ సీన్స్ చిత్రీకరించారు. ఆ సీన్స్‌పై పలువురు అభ్యంతరం వ్యక్తంచేసిన విషయం తెలిసిందే. ఈ సినిమా తర్వాత త్రిప్తికి దేశవ్యాప్తంగా అభిమానులు ఏర్పడ్డారు. 'నేషనల్ క్రష్' అని ట్యాగ్ ఇచ్చారు. అభిమానులు చూపిస్తోన్న ప్రేమపై గతంలో ఓ సందర్భంలో మాట్లాడారామె. 'బాలీవుడ్‌లో కెరీర్ మొదలుపెట్టి దాదాపు ఏడేళ్లు అయ్యింది. అందుకు సంతోషంగా ఉన్నా. గొప్ప నటీనటులు, దర్శకులతో వర్క్ చేస్తానని కెరీర్ ఆరంభంలో ఎప్పుడూ అనుకోలేదు. 'లైలా మజ్ను' తర్వాత నటనలో శిక్షణ తీసుకొన్నా. ప్రేక్షకులు నా నటనతో కనెక్ట్ అవుతున్నారని చెప్పారు.

# ఫీమేల్ లీడ్ రోల్‌గా సంయుక్త మూవీ



**- క్లాప్ కొట్టిన నటుడు దగ్గుబాటి రానా**

భీమ్లా నాయక్' సినిమాలో పవన్ కళ్యాణ్, నిత్యా మీనన్ ఒక జంటగా నటిస్తే.. మరో జంటగా రానా దగ్గుబాటి, సంయుక్త నటించారు. ఈ సినిమాలో నిత్యామీనన్ పాత్రకు ఎంత ప్రాముఖ్యత ఉంటుందో అంతే ప్రాముఖ్యత సంయుక్త పాత్రకు కూడా ఉంటుంది. ఆ పాత్రలు వారిద్దరికీ మంచి పేరునే తెచ్చిపెట్టాయి. ఇక ఇప్పటి వరకు హీరోల పక్కన నటిస్తూ సక్సెస్ అందుకుంటున్న సంయుక్త తొలిసారి ఫిమేల్ సెంట్రిక్ యాక్షన్ థ్రిల్లర్‌తో తన సత్తా చాటేందుకు సిద్ధమైంది. ఆమె ప్రధాన పాత్రలో నటించబోతున్న చిత్రం బుధవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమవగా.. ఈ సినిమాకు క్లాప్‌ను 'భీమ్లా నాయక్'లో తనకు భర్తగా నటించిన రానా దగ్గుబాటి కొట్టారు. ఈ సినిమా వరుస బ్లాక్‌బస్టర్స్ సినిమాలతో అలరిస్తున్న టాలీవుడ్ లక్కీ చార్మ్ సంయుక్త తొలిసారిగా ఫీమేల్ సెంట్రిక్ మూవీ చేస్తున్నారు. 'సామజవరగమన, ఊరు పేరు భైరవకోన' వంటి సెన్సేషనల్ హిట్ చిత్రాలను అందించిన సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ రాజేష్ దండా నిర్మించనున్న ఈ చిత్రానికి యోగేష్ కెఎంసి దర్శకుడు. మాగంటి పిక్చర్స్‌తో కలిసి హాస్య మూవీస్ ప్రొడక్షన్ నంబర్ 6గా తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని సంయుక్తనే సమర్పిస్తోంది. బుధవారం రామానాయుడు స్టూడియోస్‌లో పలువురు ప్రత్యేక అతిథుల సమక్షంలో ఈ సినిమా పూజా కార్యక్రమాలతో గ్రాండ్‌గా ప్రారంభమైంది.




# జనక అయితే గనక రిలీజ్ ట్రైలర్ విడుదల

టాలీవుడ్ కుర్ర హీరో సుహాస్ ఫుల్ ఫామ్‌లో దూసుకు పోతున్నాడు. ఈ ఏడాది ఇప్పటికే అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్, ప్రసన్న వదనం, శ్రీరంగ నీతులు, గొర్రె పురాణం అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చి విజయాలను అందుకున్న ఈ యువ నటుడు ఇప్పుడు మళ్లీ ఒక కొత్త స్టోరీతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. సుహాస్ కథానాయకుడిగా రూపొందుతోన్న తాజా చిత్రం 'జనక అయితే గనక' సినిమాకు సందీప్‌రెడ్డి బండ్ల దర్శకత్వం వహిస్తుండగా.. బలగం, లవ్‌మీ వంటి విభిన్న తరహా సినిమాల తర్వాత దిల్‌రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షిత్‌రెడ్డి, హన్షిత నిర్మిస్తున్నారు. ఈ సినిమా దసరా కానుకగా అక్టోబర్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా రిలీజ్ ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ ట్రైలర్ చూస్తే.. ఎల్‌కేజీ, యూకేజీలకే లక్షలు వసూలు చేస్తున్న ఈ కాలంలో ఒక మిడిల్ క్లాస్ యువకుడు(సుహాస్) తనకు పిల్లలు పుడితే వారిని ఎలా పెంచాలి, ఎలా చదివించాలి అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా రాబోతుంది. ఈ కాలంలో పిల్లలను పెంచడం కష్టమని పిల్లలు వద్దనుకుంటున్నా సుహాస్‌కు సడన్‌గా తన భర్య గర్భవతి అంటూ షాక్ ఇస్తుంది. అయితే తాను వాడిన కండోమ్ వలనే ఇలా అయ్యిందంటూ నాసిరకం కండోమ్‌లను సప్లయ్ చేస్తున్న కంపెనీపై కేసు పెడతాడు. అయితే ఈ కేసు సుహాస్ జీవితంలో ఎలాంటి మలుపు తీసుకుంది. చివరకు తాను కండోమ్ కంపెనీపై పెట్టిన కేసు గెలిచాడా అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ సినిమాలో సుహాస్‌తో పాటు, సంగీత్, వెన్నెల కిషోర్, రాజేంద్ర ప్రసాద్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# వార్-2లో విలన్‌గా ఎన్టీఆర్




తారక్ లేటెస్ట్ ఫిల్మ్ 'దేవర' హిట్టవ్వడంతో ఆయన మరింత జోష్‌లో సినిమాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన ప్రశాంత్ నీల్ ఎన్‌టిఆర్31తో పాటు యశ్ రాజ్ ఫిల్మ్స్‌ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న వైఆర్‌ఎఫ్ స్పై యూనివర్స్ లోని వార్ 2 సినిమాలో పనిచేస్తున్నాడు. బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ హీరోగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఎన్టీయార్ విలన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాలో తారక్ -హృతిక్ రోషన్‌కు మధ్యలో భారీ యాక్షన్ ప్యాక్‌డ్ సీక్వెన్సెస్ ప్లాన్ చేస్తున్నారు. ఈ యాక్షన్ సీక్వెన్స్‌కి సంబంధించిన ఓ అప్డేట్ బయటకొచ్చింది.. స్పై యూనివర్స్‌లో భాగంగా నిర్మిస్తున్న ఈ ఫిల్మ్ షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. ఇప్పటికే సినిమా మేజర్ పోర్షన్ షూటింగ్ పూర్తయింది. ఎన్టీయార్, హృతిక్ రోషన్ మధ్య జరగనున్న యాక్షన్ ప్యాక్‌డ్ క్లైమాక్స్ ఒక్కటి ఇంకా బాకీ ఉంది. దీంతో వచ్చే ఏడాది నవంబర్‌లో ఈ పార్ట్‌ని చిత్రీకరించడానికి సినీ యూనిట్ సిద్ధమైంది. ప్రత్యేకమైన డైట్‌ని పాటిస్తూ ఇద్దరు హీరోలు కండలు తిరిగిన శరీరాన్ని సిద్ధం చేసుకుంటున్నారు. అలాగే వీరిద్దరి మధ్య 'హ్యాండ్ టూ హ్యాండ్' ఫైట్ సీక్వెన్సెస్ కూడా ఉండనున్నాయట. ఆర్‌ఆర్‌ఆర్ సినిమా తర్వాత గ్లోబల్ స్టార్ అవతారమెత్తిన తారక్‌కి ఇది బాలీవుడ్ డెబ్యూ కావడం విశేషం. అసాధారణమైన యాక్టింగ్, పవర్ ఫుల్ డైలాగ్ డిక్షన్, స్టైలిష్ డ్యాన్సులతో సకలవల్లభుడి గా తెలుగు ప్రేక్షకులకు మాత్రమే పరిమితమైన తారక్ ని బాలీవుడ్ తొలిసారి విట్ నెస్ చేయబోతుంది. డైరెక్టర్ ఆయాన్ ముఖర్జీ ఎన్టీయార్‌ని ఎలా ఉపయోగించుకొన్నాడని సర్వత్రా ఆసక్తి నెలకొంది. వైఆర్‌ఎఫ్ స్పై యూనివర్స్‌లో భాగంగా దర్శక నిర్మాత ఆదిత్యా చోప్రా ఇప్పటికే ఏక్తా టైగర్, టైగర్ జిందా హై, వార్, పఠాన్ సినిమాలని ఇన్‌క్లూడ్ చేశాడు. ఫ్యూచర్‌లో టైగర్ 3, ఆల్ఫా, పఠాన్ 2, టైగర్ వర్సెస్ పఠాన్ చిత్రాలను ప్లాన్ చేస్తున్నాడు.

# త్వరలోనే బాహుబలి పెళ్లి...!



బాహుబలి ఫ్రాంఛైజీతో గ్లోబల్ స్టార్‌గా మారిన ప్రభాస్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో అభిమానులను ఎంటర్‌టైన్ చేసే పనిలో ఫుల్ బిజీగా ఉన్నాడని తెలిసిందే. టాలీవుడ్ మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ ఎవరంటే ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా ప్రభాస్ పేరు చెప్పేస్తారు. ఇంతకీ స్టార్ యాక్టర్ ఎప్పుడు పెండ్లి పీటలెక్కబోతున్నాడన్నది మాత్రం ప్రశ్నగానే మిగిలిపోతుంది. త్వరలోనే వెడ్డింగ్ అంటూ నెట్టింట వార్తలు హల్ చల్ చేస్తున్నా.. దీనిపై అధికారికంగా క్లారిటీ రావడం లేదు. అయితే తమ ఫేవరేట్ హీరో ఎప్పుడు ఓ ఇంటివాడు కాబోతున్నాడన్న దానిపై ఆసక్తికర వార్త తెరపైకి వచ్చింది. ప్రభాస్ పెద్దమ్మ శ్యామలాదేవి ఇటీవలే విజయవాడలోని కనకదుర్గ ఆలయాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా ఆమె మీడియాతో చిట్ చాట్ చేస్తూ.. పెండ్లిపై నెలకొన్న ట్విస్ట్‌కు ఫుల్ స్టాప్ పెట్టేసింది. అభిమా నులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ప్రభాస్ వెడ్డింగ్ అనౌన్స్‌మెంట్ త్వరలోనే ఉంటుంని చెప్పింది శ్యామలా దేవి. అయితే ఇంతకీ ఎవరా అమ్మాయనేది మాత్రం చెప్పలేదు. ప్రభాస్ ప్రస్తుతం కల్కి 2898 ఏడీ సీక్వెల్, సలార్ 2, రాజా సాబ్ సినిమాలతో బిజీగా ఉన్నాడు. ఇవే కాకుండా స్పిరిట్, కన్నప్ప, ఫౌజీ చిత్రాలు కూడా ప్రభాస్ ఖాతాలో ఉన్నాయి. మరి ప్రభాస్ నుంచి పెండ్లి ప్రకటన ఎప్పుడుంటుందనేది సర్వత్రా ఆసక్తిగా మారింది.

# ఇండియన్ 2 ఎఫెక్ట్.. నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా మణికొండ డీఈఈ లంచావతారం



అవినీతి, లంచం అంశాల నేపథ్యంలో శంకర్ తెరకెక్కించిన భారతీయుడు సినిమా బాక్సాఫీస్‌ను ఏ స్థాయిలో షేక్ చేసిందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. కమల్ హాసన్ టైటిల్ రోల్ పోషించిన ఈ చిత్రం దశాబ్దాల కిందే లంచం భూతం సమాజాన్ని ఎలా పట్టి పీడస్తుందో కండ్లకు కట్టినట్టు చూపించింది. మళ్లీ లాంగ్ గ్యాప్ తర్వాత దీనికి కొనసాగింపుగా ఇండియన్ 2 కూడా వచ్చింది.సినిమా సక్సెస్, ఫెయిల్యూర్స్ మాట అటుంచితే అవినీతికి పాల్పడిన కుబేరులకు శిక్ష పడాల్సిందేనన్న కాన్సెప్ట్ ప్రశంసించదగినదే. కొన్ని సార్లు జనాలు సినిమాలను స్ఫూర్తిగా తీసుకునే సంఘటనలు చూస్తుంటాం. హైదరాబాద్‌లోని మణికొండ మున్సిపాలిటీ డీఈఈ లంచావతరాన్ని భర్తే స్వయంగా బయటపెట్టిన విషయం తెలిసిందే. సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా నిలుస్తోంది.డీఈఈగా పనిచేస్తున్న తన భార్య లంచాలకు మరిగి రోజూ లక్షల రూపాయలను ఇంటికి తీసుకొస్తుండటం తట్టుకోలేని భర్త.. అవినీతి సంపాదనను మానుకోవాలని తన భార్యకు సూచించాడు. అయినప్పటికీ వినిపించుకోకపోవడంతో ఆమె అవినీతిని బయటపెట్టాడు. తన భార్య అక్రమ సంపాదనకు సాక్ష్యాలివే అంటూ ఇంట్లో దాచిపెట్టిన డబ్బుల కట్టల వీడియోను తీసి బయటకు రిలీజ్ చేశాడు. ఇప్పుడీ వీడియోను నెట్టింట షేర్ చేస్తూ ఇండియన్ 2 ఎఫెక్ట్ అంటూ కామెంట్స్ పెడుతున్నారు నెటిజన్లు.